గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# జూలై 2015
# కథలు




అడగందే అమ్మయినా పెట్టదంటారు. యిది అమ్మ విషయంలో కొద్దిపాటి అతిశయోక్తిగా వాడినా, వాస్తవానికి లోకంలో ఏ పని అడగందే కానీ జరగదు. ఓటు కోసం వచ్చినాయన ఒంటి చేతి దణ్ణంతో ఓటడిగితే, ఆయన ఎంపికై నాయకుడైన తర్వాత వెయ్యి నమస్కారాలు చేసినా కోరికలు తీరుస్తాడని ఎక్కడా లేదు. బిచ్చం దగ్గర్నుంచి, సినిమాల్లో వేషాల వరకూ అడిగితే కాని వెయ్యరు, కాళ్ళా వేళ్ళా పడితే కాని యివ్వరు. ఏతా వాతా తేలిందేమిటంటే జీవితంలో అదగందే ఏమీ దొరకదనీ, ఎవరైనా చెప్పందే ఎవరూ ఏమీ చెయ్యరనీ, ఖర్చుతో కూడినదైనా కాక పోయినా ఏ పని అడగనిదే జరగదనీ.

కళాకారులకి ఊపిరి అభిమానుల ప్రశంసలు. నోటి మాటలుగా కాక తక్షణంగా స్పందించి చేసే కరతాళ ధ్వనులు వక్తలకీ, గాయకులకీ, వాయిద్య కారులకీ, వేదికనేక్కిన ప్రతి వారికీ ఎంతో ఉత్సాహాన్నిస్తాయి. అయితే యిటీవలి కాలంలో ప్రేక్షక, వీక్షక మహాశయులకి రసాస్వాదన తగ్గిన కారణంగానేమో కళలకి సంబంధించి తక్షణ స్పందన లోపించి, వేదిక మీద ఎంతటి రక్తి కలిగించిన ప్రదర్శన జరిగినా ఏవో మంద్ర స్థాయి మొక్కుబడి చప్పట్లు తప్పించి హోరెత్తించేవిగా ఉండటల్లేదు. దాంతో కళాకారులందరూ కార్యక్రమం ఆరంభం ఎంత గొప్పగా ఉన్నా క్రమేపీ నీరసించిపోయి నిస్తేజమైన ప్రదర్శనలోకి జారి పోతారు. కళాకారులకి నిర్వాహకులిచ్చే సంభావనలు వేరు, ప్రేక్షకుల హస్త తాళాలు వేరు! కీర్తికి సోపానాలు హర్షధ్వానాలే. కళాకారులను ఉత్సాహ పర్చాలంటే కరతాళ ధ్వనులు అత్యవసరమని గుర్తించడంతో కార్యక్రమ నిర్వహణ కోసం ఓ నూతన కుహనా సంస్కృతి ఏర్పడింది. అడిగీ, చెప్పీ చప్పట్లు కొట్టించడం. కార్యక్రమాల్ని నిర్వహించే ‘ లంగరు’ అంటే ‘యాంకర్’ వృత్తి ప్రవీణులు పాశ్చాత్యదేశాల్లోనే కాకుండా మన భారతంలో కూడా రూపుదాల్చారు. ఎప్పుడు ఎలా స్పందించాలో తెలియని ప్రేక్షకులకి దిశా నిర్దేశం చేసే ఈ వ్యాఖ్యాన కర్తలు లేదా కార్యక్రమ సారథులు కొద్ది మినహాయింపులతో దాదాపు ప్రతి సభలోనూ ప్రముఖమైన

పాత్రవహిస్తున్నారు.

తెలుగు ప్రాంతంలో 'ఉశిరూసు' అనే వ్యాఖ్యాతాంగన మరియు లంగరు యువతి వాగ్దేవి కటాక్షంతో ఆవిర్భవించింది. ఆ యువతి కార్యక్రమ నిర్వహణా బాధ్యతని నెత్తి మీద వేసుకొని యిటూ కళాకారుల్లోనూ, సందు దేరికితే చాలు వేదిక మీదకు చేరుకొనే అనేకానేకమైన ప్రముఖుల్లోనూ, ఎప్పుడు స్పందించాలో తెలియని ప్రేక్షక, వీక్షకుల్లోనూ కొత్త ఊపిరులు పోయనారంభించింది.

" అందరికీ ఘనమైన స్వాగతం! యిప్పుడు ఈ కార్యక్రమ ప్రాయోజకులు నిమ్మ రసం నిరంజన్ గారూ, వారి సంస్థ తయారు చేసే నిమ్మ రసం సీసాలూ, డబ్బాలూ మీకు కొత్త కాదు. స్వాగత ద్వారం వద్ద యివ్వ బడిన నిమ్మ రసం, వీరి తయారీ మీద మీ విశ్వాసాన్ని మరింత పెంచిందనే అనుకొంటాను. అందుకని మీ గొంతు తడిపి స్వాగతమిచ్చిన నిమ్మ రసానికి జోరుగా చప్పట్లు కొట్టి మీ అభిమానాన్ని తెలియజేయండి!" అంది 'మైక్' తో వేదికనంతా కలయ దిరుగుతూ. 'తేరగా దొరికిందని తెగ తాగడం కాదు, యిచ్చినందుకు కృతజ్ఞతలు తెలపండి మహాశయులారా!' అన్న అంతరార్థం స్ఫురించడంతో చప్పట్లు హోరెత్తి పోయాయి. "యిక్కడ జన గణ మన పడే దాకా ఉండి వెళ్ళే వారికి మరో సారి నిమ్మ రసం యివ్వబడుతుంది. అందుకు మీ హర్షం వ్యక్తం చేయండి!" అనడంతో కరతాళ ధ్వనులు మరో మారు మారుమ్రోగాయి.

"నిరంజన్ గారు 'వర్షంలోనూ దాహం' అనే చలన చిత్రాన్ని తీస్తున్నారన్న సంగతి మీకు తెలిసిందే. మీ అభిమాన నాయికానాయకులతో ఈ చిత్రం తుది మెరుగులు దిద్దుకొని మరో పక్షం రోజుల్లో విడుదల కాబోతోంది. ఈ చిత్రం తాలూకు పాటల విడుదల శ్రవణ సంబరమిది. అంటే ఆడియో సీడీ రిలీజ్ ఫంక్షన్ అన్న మాట! ముందుగా నిర్మాత నిరంజన్ గార్ని వేదిక మీదకు రావల్సిందిగా ఆహ్వానిస్తున్నాను. ఊఁ! ఆయన కుర్చీ లోంచి లేచారు, యిదుగో వచ్చేశారు, యిలాగేనా ఆయన్ని స్వాగతించేది? జోరుగా చప్పట్లతో అభినందనలు తెలియ జేయండి మరి!" అంది ఉశిరూసు. చప్పట్లు మోగాయి.

'నా డబ్బులతో జరుగుతోందీ వేడుక. వేదిక మీదకు నన్ను నేనే పరోక్షంగా నీ ద్వారా ఆహ్వానించుకున్నట్లే ఉశిరూసూ! బాగు బాగు! నాకు సొమ్ములు వెద జల్లడం వచ్చును కాని మాటలు వెద జల్లడం రాదు! నాకే కనక మాటల గారడీ వస్తే నీ స్థానంలో నేనే ఉండేవాణ్ణి! సినిమా తీసే సరికే చుక్కలు కనబడ్డాయ్! పైగా ఈ పాటల మాటల హోరతికి మరో ఖర్చు!" అనుకొన్నాడు నిరంజన్. ప్రేక్షకులకి చేతులెత్తి అన్ని దిశలా తిరిగి నమస్కరించాడు. ' నాచేత చేతులెత్తేయించకండి ప్రేక్షక దేవుళ్ళారా!' అనుకొంటూ.

"ఈ సినిమాకి అత్యద్భుతమైన సంగీతాన్నందించిన వారు మీరు విపరీతంగా అభిమానించి, మెచ్చే 'దేవీమణిచక్రి' గార్ని వేదిక మీదకు ఆహ్వానిస్తున్నాను. ఈ సినిమాలో మృదంగ నాదాలు అంటే డ్రమ్ బీట్స్ అదిరి పోయాయని నిర్మాత గారు

చెప్పారు. ఆ నాదాలకి మించిన కరతాళ ధ్వనులతో   'దేవిమణిచక్రి' గారికి స్వాగతం పలకండి!" అంది ఉశిరుూసు.

'దేవిమణిచక్రి' హుందాగా వేదిక మీదకు రావడంతోనే   సభా మందిరంలో హస్తతాళాలదిరాయ్.

హీరో, హీరోయిన్లు ఎప్పుడొస్తారెప్పుడొస్తారని?' ప్రేక్షకుల్లో గోల మొదలైంది. ఉశిరుూసు యిబ్బందిలో పడింది. అతి చురుకు నాయకుడు 'నేత్రానంద్' ముందు వరసలో కూర్చుని సిద్ధంగాఉన్నా , నాయిక నటీమణి 'అనుకజాతమ' సభా ప్రాంగణానికి వెనక వైపున నిలబడిన అలంకార వాహనంలో తన అందాలకి తుది మెరుగులు దిద్దించుకొంటోంది.

"మీ ఆతృత నాకు తెలియంది కాదు. దారిలో ఆమె అభిమానులు అడ్డుకొన్న కారణంగా   ట్రాఫిక్ అంతరాయం కలింగిదనీ, పోలీసులు   దారి కలిగిస్తున్నారని సమాచారం అందింది. అమె త్వరలోనే వచ్చేస్తున్నారు. సినిమాలో నాయికానాయకుల నటనా విశేషాలు రెండు విధాలు. ఒకటి సంభాషణలకీ, అభినయనానికీ సంబంధించినది. రెండవది నాట్య గానాదులకు సంబంధించినది. నాట్య గానాదులు ఈనాటి మన భారత దేశీయ చలన చిత్రాలకు ప్రాణాలనడంలో సందేహం లేదు. అయితే నాదం, గానం లేనిదే   నాట్యం లేదు. ఈ చిత్రంలో అద్భుతమైన 'దేవిమణిచక్రి' గారి సంగీతానికి శృంగార భరితమే కాకుండా, సంక్లిష్టమైన   పాద విన్యాసాలతో నృత్య దర్శకత్వం చేసిన   'రాఘవ దేవా' ని ఘనంగా ఆహ్వానించండి."   సభా ప్రాంగణం చప్పట్లతో నిండిపోయింది.

"భావ యుక్తమైన గీత రచన చేసిన   సిరి చంద్ర గారిని వేదిక మీదకు పిలిస్తున్నాను. చప్పట్లతో పలకరించండి." ఆ పలకరింపుల్లో పస లేదు.

"అన్ని అంశాలనీ తగు పాళ్లలో మేళవించి అద్భుతమైన దృశ్య కావ్యాన్ని మలచిన దర్శకుడు 'వినాశినుపూరి' గారిని స్వాగతించండి."   హర్ష ధ్వానాలు మిన్నంటాయ్.

"మీరందరూ ఆసక్తితో ఎదురు చూసిన తరుణం వచ్చేసింది. ప్రాంగణం లోకి యిప్పుడే నిర్మాతల, దర్శకుల, నాయకుల, ప్రేక్షకుల అభిమాన తార 'అనుకాజతమ' అడుగు పెట్టారు. అలశ్యమెందుకు........?" అందరూ లేచి వెనక వైపుకు చూశారు. ' అనుకాజతమ' వయ్యారంగా అడుగులు వేసుకొంటూ వేదిక దిశగా పయనించింది. యువ నాయకుడు నేత్రానంద్ కుర్చీలోంచి లేచి 'అనుకాజతమ' దారినడ్డగించి, ఆమె చేతిని దొరకబుచ్చుకొన్నాడు. యిద్దరూ కలిసి   అతి నెమ్మదిగా వేదిక నెక్కారు.   ఆ ప్రత్యక్ష ప్రసారాన్ని చూస్తోన్న 'టీవీ' ప్రేక్షకుల కోసం ఆ దృశ్యాన్ని అతి మందగ మనంలో నాలుగు సార్లు మరీ మరీ బుల్లి తెర మీద చూపించారు.

సభా మందిరమంతా చప్పట్లతో కాదు కాని ఈలల తోటీ,   కేకల తోటీ నిండి పోయింది. కాస్త   సద్దు మణిగిన తర్వాత

"యిప్పుడు లయ బద్ధమైన మీ కేకిసలు......అయ్యో, ఆగండాగండి! కేకసలూ, కేకిసలూ అంటే చప్పట్లకి పర్యాయ పదాలు! అందుకని మిమ్మల్ని కొట్టమన్నది చప్పట్లని కానీ , పెట్టమన్నది కేకలు కాదు! ఆగకుండా కనీసం ఒక నిముషామైనా కరతాళ ధ్వనులు వినిపించండి!" అని ఒక చేత్తో మైకు ఎత్తి పట్టుకొని, రెండో చేత్తో మైకు మీద బాద సాగింది. అందరూ అలాగే చేతులు పైకెత్తి భజన రీతిలో చప్పట్లు కొట్టారు. ఉశిరూసు హీరో, హీరోయిన్ల వైపు మెప్పు కోసం చూసి నిరాశ పడింది. ఎందుకంటే వారిరువురి దృష్టి ప్రేక్షకుల వైపే సారించి ఉన్నాయి. అదీ కాక సదరు నటీ మణి మాటి మాటికీ మొహం మీద పడే జుత్తుని సవరించుకొంటూ యమగా హావ భావాలు ప్రదర్శిస్తూ ఉంది. ఆమెకు ఉశిరూసు తెలుగు మాటలు అర్థం కావటల్లేదు. ఆమెకు అర్థమయ్యేవి చప్పట్లూ, ఈలలూ, కేకలూ!

"ఈ సినిమా కాలేజి వార్షిక దినోత్సవ సంబరాల దృశ్యంతో ప్రారంభమౌతుంది. నాయికా, నాయకులు విజృభించి పోతూ పోటాను పోటీగా పాడే పాటట! విశిష్ట అతిథిగా ఆహ్వానితులైన జగద్విఖ్యాత దర్శక, నిర్మాత 'రాఘువేంద్ర నారాయణ రావు గారు' ఆడియో సీడీని ఆవిష్కరించి ఆ పాటని వినిపిస్తారు. ఘనంగా ఆయన్ని స్వాగతించండి!" అంది. కరతాళ ధ్వనులు నీరసంగా వినిపించాయి. వేదిక వెనకనున్న ప్లాస్మా తెర మీద నాయకుడి పిడికిలీ, నాయిక నాభీ, కింద 'జీన్ పాంటూ' కనబడ్డాయి. చప్పట్లు అదిరిపోయాయి. అదే అదనుగా, ఆ చప్పట్లు ముగియక ముందే ప్రముఖ దర్శక నిర్మాత, మూడడుగుల వ్యాసం గల ఓ గుండ్రటి ప్లాస్టిక్ ఫలకం మీది ముచ్చి రేకుని ఛిద్రం చేసి, అందరికీ ఎత్తి చూపాడు. దాని మీద కూడా అవే పిడికిలీ, నాభీ రంగుల్లో ముద్రించి ఉన్నాయి. తర్వాత అందమైన ఓ చిన్న పెట్టి లోంచి చిన్న సీడీలు తీసి అందరికీ పంచాడు. మొదటి పాటని ఆవిష్కరించాడు. 'యింకో సారి ప్రముఖ దర్శక నిర్మాతని చప్పట్లతో అభినందించండి' అనే అవసరం కలగ నందుకు ఉశిరూసు ఊపిరి పీల్చుకుంది. ఎందు కంటే నాభి బొమ్మ ప్లాస్మా తెర మీద కనబడ్తున్నంత సేపూ చప్పట్ల జోరు తగ్గ లేదు.

"యిప్పుడు చిత్రంలోని ఈ మొదటి పాటని నృత్య కళా కారులు నృత్య రూపంలో మీ ముందుంచుతారు. నాయికా-నాయకుల ఉత్తేజ కరమైన ఈ నృత్యం కోసం మీరు చిత్రం చూడాల్సిందే! క్లాసులు బంకు కొట్టి, ఆఫీసులు ఎగ్గొట్టి, మొదటి ఉదయం ఆటకి టికెట్ వంపులు తిరిగిన బారుల్లో నిల్చుని కొంటారో, లేక నల్ల బజార్లో కొని చూస్తారో మీ యిష్టం! అదేమిటి అలా నిశ్శబ్దం వహించారు? నా మాటలు మీకు రుచించ లేదా?"

సమాధానంగా చప్పట్ల దరువులతో సభా మందిరం దద్దరిల్లి పోయింది. వేదిక మీదనున్న వారందరూ దిగి తమ ఆసనల్లో కూర్చున్నారు. నేపథ్యంలో ఆ పాట వినబడ్తూండగా రంగ స్థల కళాకారులు నృత్యం చేశారు. నాయిక, నాయకుడు ఒకరి నొకరు చూసుకొంటూ కాస్తగా పెదవి విరిచారు. వెయ్యి ముక్కలుగా తీసి, అద్భుతంగా జోడించిన తెర మీది నృత్యాల్ని ఆదరించే ప్రేక్షకులకి ఈ కళా కారుల నృత్యం అంతగా రుచించ లేదు. అయితే నాయికా, నాయకులు కూడా తాము పెదవి విరచడంలో అర్థం లేదని గ్రహించలేదు.

"వీరి నృత్యమే యింత పసందుగా ఉంటే, తెర మీద మీ ప్రియతమ నాయికా నాయకుల నృత్యం యింకెంతటి పులకింతలు కలిగిస్తుందో ఊహించుకోండి. ఊహా గానాలెందుకు, చూసి తరించండి! రుచి చూపించిన ఈ కళాకారులకి హర్ష ధ్వానాలతో అభినందనలు తెలియజేయండి!"

చాలామంది అరచేతులు అంటించారు కాని ధ్వనులు మట్టుకు వినబడలేదు!

"యిక రెండవ పాట స్వయంగా 'దేవీమణిచక్రి' గారే విడుదల చేస్తారు. పాట నేపథ్యంలో వినపడ్తుంది. అదే సమయంలో దర్శకుడు 'వినాశినుపూరి' సంగీత దర్శకుణ్ణి పుష్ప గుచ్ఛంతో, దుశ్శాలువతో సత్క రిస్తారు." అందమైన పాట వరస కోసమూ, గౌరవ ప్రదమైన సత్కారం కోసమూ కలిపి చప్పట్లు కొట్టించింది ఉశిరూసు.

మూడో పాటని నిర్మాత నిరంజన్, నాలుగో పాటని దర్శకుడు 'వినాశినుపూరి', అయిదో పాటని ఆ సినిమాకి మరోలా జీవం పోశారన్న హాస్యబ్రహ్మ 'నారాయణానందాలి', ఆరో పాటని నాయికా నాయకులు సంయుక్తంగానూ విడుదల చేశారు. పాట విడుదలకీ, పాట విడుదలకీ మధ్య పరస్పర ప్రశంశలూ, స్వోత్కర్షలూ పుష్కలంగా చోటు చేసుకొన్నాయి. ఒక్కొక్క పొగడ్తకీ, స్వోత్కర్షకీ చెప్పి, అడిగీ చప్పట్ల పర్వం కొనసాగించింది ఉశిరూసు.

చివరగా ఇంగ్లీష్ లో మాట్లాడబోయి తెలుగులోకి జారిన నాయకుడూ, 'నాకు తెలుగు రాదు. అయినా ప్రయత్నిస్తాను!" అన్న ఒక్క వాక్యం తెలుగులో ముద్దుగా అని, వెంటనే తనకి వచ్చిన రీతిలో యింగ్లీష్ లోకి మారి నాయికా, 'ప్రేక్షకులే తమకి సర్వస్వం, వారే తమకి ఆరాధ్య దేవతలు' అంటూ ఉపన్యాసాలు ముగించారు. వారిరువురూ మాట్లాడుతోన్నంత సేపూ ప్రాంగణమంతా చప్పట్లతో కాకుండా ఈలలతోటీ, కేకలతోటీ నిండి పోయింది. ఉశిరూసు తెలివిగా మౌనం వహించింది. తర్వాత ఉశిరూసు అందరికీ, అందరి తరఫునా, పేరు పేరునా ధన్యవాదాలర్పించింది. మొదటి పిలుపులో వేదిక నెక్కి వెనక వరసలో కూర్చున్న గీత రచయితకీ, నేపథ్య గాయకులకీ, రంగస్థల కళాకారుల ప్రదర్శనల తర్వాతా, పాటల విడుదల సమయంలోనూ మళ్ళీ పిలుపు రాలేదు. వాళ్ళు నాలుగైదు సార్లు ఆశా భావంతో ఉశిరూసు వైపు చూశారు. ' నేనేం చేయ గలను? మాట నాది కాని, సభా నిర్వహణ కార్యక్రమం రాసిచ్చింది వారే!" అన్నట్టు కళ్ళ తోటే సముదాయించింది.

'నేపథ్య వాయిద్యాల ఘోషలో గీతంలోని సాహిత్యపు సొంపులు కాని, గాయకుల నైపుణ్యం గాని సిని ప్రేక్షకుల అవగాహనకు ఎలానూ రావు! కనబడేదల్లా ఎదల పొంగులూ, నాభి లోయులూ, నడుము కదలికలూ, జఘనాల మీద దరువులూ, ఒంటి చేతి పోరాటాలు,రెండర్థాల మాటలూ తప్ప మరేమీ మీ కావు! సరేలే దీనికింత చింతించాలా?" అని గేయ రచయితలూ, నేపథ్య గాయకులూ తమ్ము తాము సమాధాన పరచుకొన్నారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత ఉశిరూసు వీలైనంతగా కరతాళికల జల్లులు కురిపించి యిల్లు చేరింది.

భర్తా, కొడుకూ టీవీ కి అతుక్కుపోయి కూర్చుని మరేదో పాటల పోటీ కార్యక్రమాన్ని చూస్తున్నారు. ఓ సుప్రసిద్ధ నేపథ్య గాయకుడు ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాడు. టీవీలోంచి కరతాళ ధ్వనులు వినవస్తున్నాయి. తల్లిని చూడగానే, 'మమ్మీ! యింతవరకూ నీ ప్రోగ్రాం చూశాం. అదిరిందనుకో!" అన్నాడు పదేళ్ళ కొడుకు.

"అలా అనేసి ఊరుకుంటే కుదరదు! చప్పట్లు కొట్టాలి!" అన్నాడు భర్త.

"చప్పట్లూ, గిప్పట్లూ అంటే చేతులు విరగ్గొడ్తాను! నోరు మూసుక్కూర్చోండి!" అంది ఉశిరూసు తిక్కతిక్కగా. కలపబోయిన భర్త చేతులు మధ్యలోనే భయం భయంగా ఆగిపోయాయి! టీవీ కేసి చూస్తూ 'గాన గంధర్వుడికే పాట్లు తప్పటల్లేదు. నేనెంత?" అనుకొంటూ సోఫాలో కూలబడింది.

స్పందించి చేసే కరతాళ ధ్వనులకీ, సభా మర్యాదకోసం చేయించే కరతాళ ధ్వనులకీ అంతరముంటుంది. అయితే స్పందనా, సభా మర్యాదా-రెండూ తెలియని ప్రేక్షకులున్నంత కాలం- వ్యాఖ్యాతలకు చెప్పి చప్పట్లు కొట్టించే తలనొప్పి తగ్గదు!

ముక్తాయింపు: యింత గొడవెందుకు? ఆంగ్ల హాస్య టీవీ ప్రదర్శనల్లోలాగా కళా మందిరాల్లో కూడా ప్రదర్శనలు జరుగుతున్నప్పుడు కృత్రిమ కరతాళ ధ్వనులు ఏర్పాటుచేస్తే పోతుందిగా?



నిన్ను..కత్తితో కాకుండా కంటి చూపుతో చంపేయాలనుందే..ఇదేమన్నా సతీ సావిత్రి యుగమా. సతీ సుమతి కాలమా..ఆ డర్టీ గూస్ గాడి పెళ్లికి..ఈ ప్రెట్టీ గూస్ చందనా చీర బొమ్మనా బ్లౌజుతో తయారవడం.. నీకసలు సిగ్గూ శరం లజ్జ అభిమానంలాంటి వేమైనా వున్నాయా..?" ఉడికి పోతూ అడిగింది సౌమ్య..డ్రస్సింగ్ మిర్రర్ ముందు తన అందాన్ని చూసుకుంటూ తయారవుతున్న స్వాతిని..చూస్తూ మండిపోతూ.. "అందంగా లేనా..ఈ చీరా జాకెట్లో.. అసలేం బాలేనా" ..మిశ్చివస్ గా అడిగింది మరింత రెచ్చగొడతూ..

"మాట మార్చకు..తిక్క రేగిందంటే తొక్కలో ఫ్రెండని కూడా చూడ్ను..లవ్వు పేరు చెప్పి ఇంత కాలం నీతో చెట్టా పట్టాలేసుకు తిరిగి ..కక్కిన కూడు లాంటి కట్నానికి కక్కుర్తి పడి వేరే అమ్మాయిని పెళ్లి చేసుకుంటుంటే..పీక పిసికి చంపేయాల్సింది పోయి..ఆ పుండా కోరు గాడి పెళ్లికి పట్టు చీర కట్టుకుని ..ఫ్రెండ్స్ అందర్నీ వెంటేసుకుని మరీ బయలు దేరుతున్నావ్..నిన్నేమైనా పిచ్చి కుక్క గాని కరిచిందా..మెంటలేమైనా ఎక్కిందా.."ఫ్లై రఫ్ అయిపోతున్న సౌమ్యను ఓరకంట చూస్తూ."నా జడ బాగుందా..క్లిప్.. శారీకి సూటయ్యిందా.". కావాలని మరింత రెచ్చగొడుతున్నట్లు చిరునవ్వుతో చూస్తూ చిద్విలాసంగా అడిగింది అద్దానికి అతుక్కు పోతూ.

"నీ ఎంకమ్మ..రెచ్చగొట్టావంటే..డెమ్మ..డెక్క..డాలి..బూతులొచ్చేస్తాయ్..పిచ్చెక్కి పోయి కేరాఫ్ వైజాగ్ అయిపోతావ్..దాదాపు రెండేళ్లు నీ అందాన్నీ   ఆదాయాన్ని కూడా అంట నాకేశాడు కదే అంట్ల వెధవ..మీ డాడీ కడుపు కట్టుకుని కట్నం కూడా యిస్తానన్నారు కదా.. మరి వీడికిదేం రోగం. అమెరికా జాబ్ వచ్చింది కదా అది చూపించుకుని సంతలో పశువులా ఎక్కువ ధరకు అమ్ముడు పోయింటాడీ పశువు..నేనప్పుడే చెప్పాను . ఇది మల్లీశ్వరి కాలం కాదు..కొవ్వు తప్ప లవ్వు లేదని.. ఎన్నో సార్లు మొత్తుకున్నాను.. నన్నో పిచ్చిదానిలా చూశావ్..సరే..అదంతా అయిపోయిన ఛాప్టర్ అన్నావు.. వదిలేశావ్..మరి ఇప్పుడు మళ్లీ పిచ్చి దానిలా బిహేవ్ చేస్తున్నావ్..నిన్నెలా అర్థం చేసుకోవాలో అర్థంగాక చచ్చిపోతున్నాను." చిదేసిన సినిమాకు సిల్వర్ జూబ్లీ ఫంక్షన్ చేద్దామన్న డైరెక్టర్ ని చూసిన ప్రొడ్యూసర్ లా ముఖం పెట్టేసింది సౌమ్య.

"అలికి ముగ్గులేస్తే అట్ల తద్ది అయిపోతుందా..? కార్డులు ప్రింటైనంత మాత్రాన..కల్యాణమై పోయినట్లేనా?..బిట్వీన్ సిప్ అండ కప్ మిలియన్స్ ఆఫ్ స్లిప్స్..ఈ సోదంతా ఎందుకే సౌమ్యా..ఎక్స్ ఎంపి గారమ్మాయట బ్రైడ్..ఒకటేమిటి   వంద ఐటమ్స్ వుంటాయ్..కుమ్మేద్దాం అంతే..అయినా నాకో డౌట్..ఏ సూరేకాంతమో ,ఛాయా దేవో పెట్టకుండా నీకు సూట్ కాని సౌమ్యేందుకు పెట్టార్రా బాబో"!

డ్రమెటైజ్ చేసింది..స్వాతి.. అది తెచ్చి పెట్టుకున్న బింకమని అర్థం చేసుకున్న సౌమ్య   మూగదై పోయింది.

******

ఫంక్షన్ హాల్ చాలా రిచ్ గా హుందాగా వుంది. అప్పటికే కార్యక్రమం మొదలై పోయింది. స్వాతి తన ఫ్రెండ్సుతో ఓ మూల సెటిలై పోయింది.

"అలంకరించిన దున్నపోతులా ఎలా వెలిగి పోతున్నాడో చూడవే..నీ మాజీ. ".కామెంట్ చేసింది సౌమ్య..స్వాతి ముఖంలోకి చూస్తూ.

" మనకెందుకే అవన్నీ..వచ్చామా..తిన్నామా..వెళ్లామా..దట్సాల్". సినిమా డైలాగ్ చెప్పి..వెయిటర్ అందించిన కూల్ డ్రింక్ సిప్ చేస్తూ." .సినిమాని ఎంజాయ్ చెయ్యి తల్లీ..కోతి ముఖం హీరోల్ని కడుపులో తిప్పుతున్నా భరిస్తున్నాం..ఇది ఫ్రివ్యూ ..ఫ్రివ్యూ..హీరో నచ్చకపోతే హీరోయిన్ని దేఖ్.." పొంతన లేకుండా సినిమా కబుర్లు చెప్తున్న స్వాతిని అదోలా చూస్తూ..దీని కివ్వాళ ఏదో అయ్యింది..అని కన్ ఫం చేసేసుకుంది..సౌమ్య.

సర్వాలంకార భూషితైన పెళ్లి కూతురిని ముత్తైదువలు తీసుకొచ్చారు .

"వావ్..హీరోయిన్ ..సూపర్ "..సౌమ్య చెవిలో గుసగుసలాడేసింది స్వాతి.

"నీకన్నా కాదులే..ఔనూ అదేంటి..పెళ్లి మంటపానికెళ్లాల్సిన లావణ్య ఇటొస్తోంది." ?.స్టేజ ముందుకొస్తున్న పెళ్లి కూతుర్ని వింతగా చూస్తూ కామెంట్ చేసింది సౌమ్య.

"కేట్ వాకేమోనె..అద్దిరి పోయింది కదా..విజిల్ కొట్టవే ఓసారి.".గడ్డం పట్టేసింది..

పౌడర్ ఫేస్ పెట్టేసింది..సౌమ్య.

హుందాగా స్టేజ్ ముందుకొచ్చిన పెళ్లి కూతురు చేతిలోకి ఎఫ్ ఎం మైకు తీసుకుంది. .ఒక్క సారిగా శబ్దం గడ్డ కట్టుకు పోయింది..మంత్రాల శబ్దం కూడా మూగబోయింది..

"ఆహుతులందరికీ నా నమస్కారాలు..నాపేరు లావణ్య..పెళ్లి కూతుర్ని..జరగబోయే పెళ్లిని మీరెలాగూ చూస్తారు..మేరేజెస్ ఆర్ మేడిన్ హెవెన్ అంటారు..నాపెళ్లి మాత్రం యిక్కడే ఓ మేరేజ్ బ్యూరో వాళ్ల ద్వారా ఫిక్స్ చేయబడింది..ఒక నాడు మా డాడీ చెప్పారు..నీకో మంచి సంబంధం చూశాను..అబ్బాయిది ఈ ఊరే ..సాఫ్ట్ వేర్ ఇంజినీర్ ..అమెరికాలో జాబ్..నువ్వు ..స్కైప్ లో మాట్లాడు..ఫేస్ బుక్ చూడు..నువ్వు ఓకే అంటే మిగతా విషయాలు నేను చూసుకుంటానన్నారు..ఓ సగటు ఆడపిల్లకి..ఇంత కంటే ఏంకావాలి చెప్పండి..సరే అన్నాను. అలా ఫిక్సయ్యింది ఈ మేరేజ్ . కంప్యూటర్ సైజు కార్డులేయించి ..ఎక్స్ ఎంపీ లెవెల్లో వూరంతా పంచేశారు..ఎటు చూసినా ఆనందమే..మేఘాల్లో తేలిపోతున్న నాకు..వూహించని ఓ పిడుగు పాటు .."

ఒక్కసారిగా మూగదైపోయింది లావణ్య..ఆహుతులంతా అయోమయంలో పడిపోయారు. వెంటనే తేరుకుంది   లావణ్య.." ఆరోజు మెహందీ ఫంక్షన్ లో..నా   ఫోన్ కో మెయిలొచ్చింది..ఓపెన్ చేశాను..ఒక చిన్న లెటర్ ..దయచేసి వినండి.." తన సెల్ ఫోన్ ఓపెన్ చేసి..చదవడం మొదలు పెట్టింది.

పెళ్లి కొడుకు తరఫు వాళ్లు గొడవ చెయ్యబోతే అప్పటికే అలర్టయిన పోలీసులు అదుపు చేసేశారు.

"మిస్   లావణ్యా..కంగ్రాచ్యులేషన్స్ ..నీ కాబోయే .. వరుడు గోపీ... నేనూ టూ యియర్స్ నుండీ లవ్ లో వున్నాం..మా అమ్మా నాన్నా కట్నాలకాశపడే టైపని బీదరుపు లేడిస్తే మా డాడీని కట్నం యిచ్చేందుకు కూడా ఒప్పించాను..పెళ్లికి డేట్ ఫిక్సు చేసుకొస్తానని వెళ్లిన వాడు ముఖం వేలాడేసుకు వచ్చి..కాళ్లు పట్టుకుని కహానీలు చెప్పబోయాడు .అవసాన దశలో వున్న తన తల్లి కోరిక తీర్చడం కోసం కాన్ట్ బట్ పొజిషన్ లో కమిటయ్యా నన్నాడు..బాస్టర్డ్ ..అధిక ధరకు అమ్ముడు పోయాడని అర్దమై పోయింది. ముఖం మీద ఉమ్మేసి పొమ్మన్నాను..ఇలాంటి" నీచ్ కమీన్ కుత్తే గాడి నా"   నేను లవ్ చేసిందని ..సిగ్గుతో చితికి పోయాను..రేపు నీతో పెళ్లయ్యాక మరో తండ్రి ఎక్కువ కట్నం ఆశ చూపితే వీడి అమ్మా నాన్నలు నిన్నుఏ పెట్రోలో కిరోసినో పోసి డెఫినెట్ గా చంపేస్తారు. ఐ స్వేరిట్ . నా ఫేస్ బుక్ చూడు..నా మెయిల్ ఐడి పాస్ వర్డ్ లు యిస్తున్నాను.. నా మెయిల్ ఓపెన్ చేసి చూడు   ..మా భాగవతం బట్ట బయలౌతుంది. మీ నాన్న గారికున్న ఇన్ ఫ్లూయెన్స్ తో ఎంక్వైరి చేయించు.. ఈ ఫ్యామిలి బతుకు మీకే అర్దమవుతుంది..బెస్టాఫ్ లక్.." ఆ లెటర్ మా డాడీకి చూపించా..

"ఇఫ్ ఇటీజ్ ట్రూ ఐ విల్ సీ దైర్ ఎండ్ అన్నారు." ఎంక్వైరీ చేయించారు..ట్రూ అని కన్ఫం ఆయ్యింది. నేను ప్రజల కోసం బ్రతికిన వ్యక్తిని..వీడి ప్యామిలి కి ఏ ఆడ పిల్లా బలి కాకూడదు..వీడి ఫ్యామిలిలో మరో యిద్దరు పెళ్లికెదిగిన పశువులున్నాయని తెలిసింది ..ఓ పది లక్షలు ఖర్చనుకుందాం..మన బంధువులకి విందిచ్చామనుకుందాం..కనీసం మన బంధువులనైనా హెచ్చరించిన వాళ్లమవుదాం ..చివరి నిమిషం వరకు లీక్ కాకూడదు..నీ జీవితంతో బాటు మరో యిద్దరు ఆడ పిల్లల జీవితాల్ని కాపాడిన ఆ అమ్మాయిని మర్చిపోకు.." అన్నారు. మోస పోయిన స్వాతికి ఫోన్ చేసాను..ఆ వెధవ ముఖం చూడను గాక చూడనంది.. విషయం వివరించాను.పబ్లిక్ స్టేజి మీద ఆ పశువును   అయిదు నిమిషాలు తనకు అప్పగించాలన్న షరతు మీద వస్తానంది..వచ్చింది..ప్లీజ్ కం స్వాతీ !" అంటుంటే .. ఫస్ట్ షాటుకు ఉవ్విళ్లూరుతున్న బ్రాండ్ న్యూ హీరోయిన్ లా దిగ్గున లేచి సౌమ్యను చిలిపిగా చూసి కొంటెగా కన్నుకొట్టి పెళ్లి మంటపం మీదికి దూసుకు పోయింది స్వాతి.. ద రెబల్ హీరోయిన్ ఆఫ్ ద ఫంక్షన్.

స్వాతినలా చూస్తూనే.. పెళ్లి కొడుకు శివరై పోతే..వాడి కుటుంబ సభ్యులు భూకంపాన్ని కళ్లారా చూసిన నేపాలీల్లా..వణికిపోయారు .

ఎదురొచ్చి   ఎక్స్ ఎంపి చలపతిరావు గారు స్వాతిని అక్కున చేర్చుకున్నారు..లావణ్య   స్వాతిని కౌగిలించేసుకుని బుగ్గ మీద ముద్దు పెట్టేసి.. డాడీని చూస్తూ..

"డాడీ మాతో కేసు పెట్టిస్తారో..వాడి పాస్ పోర్టు సీజ్ చేయిస్తారో అప్ టు యు.. అమ్మాయిల జీవితాలతో   ఆడుకునే ఇలాంటి మృగాళ్ల కుటుంబాలమ సభ్య సమాజం భహిష్కరించాలి..అదీ వీడి   కుటుంబంతోనే మొదలవ్వాలి. ఆహుతులందరిని చేతులు జోడించి వేడుకుంటున్నాను.. అమ్మా నాన్నలు అమ్మాయిలకు పెళ్లి చేయడమే తమ జీవితాశయంగా

ఫీలైపోతున్నారు..దానిని నేను తప్పు పట్టడం లేదు..సంబంధం కలుపుకునే ముందు తర తరాల వంశ చరిత్రలు చూడలేకపోయినా..కనీసం ఇరుగూ పొరుగూనైనా ఎంక్వైరీ చేయండి ..ఇటువంటి కొజ్జా కుటుంబాల గురించి కనీసం హింటైనా దొరుకుతుంది ..కమీషన్ల కోసం కక్కుర్తి పడే మ్యారేజ్ బ్యూరోలను గుడ్డిగా నమ్మకండి... స్వాతికి నేను వాగ్దానం చేశాను..ఈ కుక్కను ఓ అయిదు నిమిషాలు సరెండర్ చేస్తానని..నౌ టైం హేజ్ కం.".అంటూనే బిక్క చచ్చి పోయి నిలబడున్న పెళ్లి కొడుకు జుట్టు పట్టుకుని లాక్కొచ్చి స్వాతి ముందు నిలబెట్టింది.

అంతే..భద్రకాళిలా మారిన స్వాతి కాలి చెప్పు తీసి..దవడ పళ్లు రాలేలా బాదేసింది.

కల్యాణ మంటపం ఆహుతులు కొట్టిన చప్పట్లతో కమనీయమై పోయింది.




బాబుతో బాటు కమల హడావిడిగా సెకండ్ ఏ .సి .కోచ్ లో దాదాపు పరుగు పెడుతూ వచ్చి సీటుపై హమ్మా అని కూల బడింది . ఏదో మీనా గారి చలవ వాళ్ళ ఎమర్జెన్సీ కోటా లో సీట్ కన్ ఫర్మ్ అయ్యింది.

అమ్మయ్య అంటూ బాబుతో కూర్చొని పేపర్ చదువుదామని తీసింది. అంతలో ఫోన్ మ్రోగడంతో తీసింది " మేడం! నవీన్

మూడవ ఫ్లోర్ నుండి దూకి ఆత్మ హత్యే చేస్కున్నాడండి,." ఎం ఏ హిందీ అనిల్ గొంతు . "అదేంట్రా! మొన్న నేను క్లాసులో నుండి వచ్చేటపుడు ఇద్దరూ అమ్మాయిలతో తైతక్కలాడుతున్నారు గదరా? ఏమయింది ?" ఆవేదనతో అడిగింది కమల "నిన్న ఆన్ లైన్ లో రిజల్ట్స్ పెట్టారు మేడం. లాస్ట్ సెమిస్టర్ కదా, తప్పాడంట! కుటుంబ ఆర్థిక పరిస్థితుల రీత్యా ఆత్మహత్య చేసుకుంటున్నానని లెటర్ రాసి ఉంచాడు మేడం !" అన్నాడు ."అదేం ! పోయేకాలంరా! ఎం .బి.ఏ. లో వున్న కుర్రాడు సెమిస్టర్ తప్పాడన్టే చస్తాడా? తల్లిదండ్రులకు ఏదన్నా సంపాదించి ఇవ్వొచ్చు, ముసలితనంలో తోడుగా ఉండవలసిన వాడు కడుపులో చిచ్చు పెడతాడా?" కోపంగా అరిచింది కమల ట్రైన్ లో ఉన్నానన్న సంగతి మరచి. ." "తెలియదు మేడం! మీకు చెప్పాలని ఫోన్ చేశాను, తర్వాత చేస్తాను వుంటానండి " ఫోను పెట్టేశాడు . యూనివర్సిటీ, కాలేజ పిల్లలు ఏ రాష్ట్రమైనా ఒకే మనస్తత్వం కలవారు కాబోలు. ఈ కాలం పిల్లలకు వేగం ఎక్కువ, వివేకం తక్కువ. ఓటమిని భరించలేరు . తెలివి దండిగా వుంది. అహం అంతకంటే ఎక్కువ. వాళ్లకుండే సైన్సు పరిజ్ఞానంతో లోకాన్నే తన వైపు తిప్పుకోగలరు. "అదేంట్రా! అరియర్స్ పెట్టావ్ ! వళ్ళు వంచుకొని చదివితే దానంతటఅవే పాస్ మార్కులు వస్తాయంటే .."మేడం ! అరియర్స్ లేనివాడు అర్ధ మనిషండి "అని నవ్వే వాళ్ళు . "మరి కంప్లీట్ మ్యాన్ అవ్వాలంటే రేమండ్ సూట్ వేసుకొని కాంప్లాన్ తాగాలా ? తను కూడా జోకులేసి తిట్టేది. మొన్న తనను చిరునవ్వుతో పలుకరించిన ఇరవై ఏళ్ల చిన్నారి ఈ రోజు లేడు..ఏమి లోకమో!" మనసు బాధతో ములిగింది.

బనారస్ స్టేషన్ లో బాబుతో సహా ట్రైను నుండి దిగినప్పుడు మిట్ట మధ్యాహ్నం రెండు. ఎండ బాగా దంచుతున్నది. ఆ ప్లాట్ ఫారం నుండి మెట్లు దిగి బయటకు వచ్చేలోపు అమ్మ కడుపులోంచి వచ్చినట్లుంది . "'అయినా పాపం ముసలి వాళ్ళు ఎలా ఎక్కి దిగుతారు? మన ప్రభుత్వానికి అస్సలు బుద్ధి లేదు. అన్ని రైల్వే స్టేషన్లలో ఎస్కలేటర్స్ పెట్టి ఏడ్వచ్చుగా ! విసుగ్గా అనుకొంది మనసులో. ప్రీ పెయిడ్ ఆటోలో ఓ పెద్ద క్యూ..కాని కౌంటర్ లో ఎవడూ లేడు. యు.పి అంటే ఉల్టా పుల్టా మేడం ! ఓ స్టూడెంట్ చేసిన కామెంట్ గుర్తుకు వచ్చింది. గంటసేపు తిప్పలు పడి ఆటోలో ఎక్కి బుకింగ్ చేసిన రూంకు దారి చెప్పింది. ఆటోలో వస్తున్న ఒత సేపు అక్కడా ఇక్కడా పరికించి చూసింది.

ఇరవై సంవత్సరాలలో ఏమీ మారలేదు.అవే మురికి కాలువలు, సందులు, ఓపెన్ సెప్టిక్ ట్యాంకులు రోడ్డుపై ప్రవాహిస్తూ...అక్కడే అమ్ముతున్న పండ్లు. తిను బండారాలు...రామ..రామ! ఎంత రోత! "క్యోఁ ? భాయి సాహెబ్ !ఏ దేవ్ నగరి. అబ్ తక్ గన్దీ నగరీ హీ బనీ రహి| కోయి బదలావ్ న ఆయా! సర్కార్ తో బదల్ గయీ (అదేంటి అన్నా! దేవా నగరి మురికి నగర్ గానే వుండి పోయింది, ప్రభుత్వం మారినా ఏ మార్పూ రాలేదేంటి ?) అడిగింది ఆటో అతన్ని ఉండ బట్టలేక. " జీ మేం సాహెబ్ ! ఉన్కేలియే వోట్ చాహియే, జనతా నహీ..అబ్ గంగా మైయా ఉసే బులాతీ నహీ ...అన్నాడు బాధతో, వ్యంగంగా. (వాళ్ళకు ఓట్లు కావాలి, ప్రజలు కాదు, ఇప్పుడు గంగా తల్లి పిలవ లేదు). స్వచ్ఛ భారత్ అని జగమంతా చాటి చెప్పే ప్రధాన మంత్రి దృష్టి పి.ఎం. గా నెగ్గించిన ఈ పట్నం పై ఎందుకు పడలేదు ? అనుకుంటే గంటకు నూరు మంది పని వాళ్ళను నియమించి మూడు రోజులలో స్వచ్ఛ కాశి గా తయారు చేయవచ్చు గదా! అక్కడి ముస్లింల సందులు చూస్తే కంట్లో నీళ్ళు తిరుగుతాయి. వాళ్ళు మనుషులు కారా? అంత గలీజులో చిన్న చిన్న పాపాయిలు ఆడుకుంటూ కనిపించారు. ప్రభుత్వమేదీ పట్టించుకొనకుండా ఎందుకు వూరుకుంటుంది ? ఈ పట్టణాన్ని సరి చెయ్యలేదా? అనుకుంటూ బాధగా చూసింది కమల.

ఆలోచనల్లోనే రూము వచ్చేసింది. ఆటో వాడికి డబ్బులిచ్చి  రూముకు వెళ్లి ఫ్రెష్ అయి సాయంత్రం బాబుతో బాటు "గంగా హారతి " చూడడానికి  నావ తీసుకొని ఆవలి వడ్డు దాక తిరిగసాగింది. పవిత్రమైన గంగా నదిలో తేలుతున్న శవాన్ని ఈడ్చుకుంటూ ఒడ్డుకెళ్ళే కుక్కలు, చెత్త కుండీ లో వేయవలసిన చెత్తా  చెదారాలు, ఇంకా ఎన్నో సేవేజీ ట్యాంకు పెద్ద పెద్ద గొట్టాలు, గంగలో కలిపి వేయబడి వున్నాయి. మొత్తం కాశీలోని మైలంతా గంగాకే సమర్పిస్తున్నారు జనులు . అక్కడ ఏ ఘాట్ లో వున్న ఇంటికి వెళ్ళాలన్నా ముక్కు మూసుకొని వెళ్ళాల్సిందే. చుట్టూ మురికి కాలువలు, చెత్త అన్నీ చిన్న చిన్న సందుల్లో వున్న ఇంటి ముందు వుంటాయి. ఏ ఇల్లైయినా అలాంటి దారే మరి. ఎంత మంది, ఎన్ని బాషల ప్రాంతాల వారు వస్తున్నారు. దాన్ని పరిశుబ్రంగా ఉంచడానికి ప్రభుత్వం ఖచ్చితంగా చర్యలు తీసుకోవాల్సిందే. అనుకుంది కమల. ఆ మాటే చెప్పినందుకు "కాశీలో చూసిన మురికిని కామెంట్ చేయరాదు. అంతా శివమయం అన్నాడో ఛాఒదసుడు. శివుని పరిసరాలను శుబ్రంగా ఉంచరాదని ఏ శాస్త్రంలోనన్నా,రాసివున్దా? ప్రజల అమాయకత్వాన్ని, భక్తి పేరుతొ ఆడుకొనే ధార్మికులు , ఓట్ల పేరుతో ఆడుకొనే రాజకీయ నాయకులపై కమలకు ఏవగింపు కలిగింది. తల్లికి 6వ నెల కర్మ కాండ తన బాబు చేతులతో జరిపించిన చోట కలసిన తెలుగు వంటావిడ వెంకట రమణమ్మ గారు. దాదాపు యాభై ఐదేళ్ళుఒటాయి. ఓ స్టిక్కర్ బొట్టు,రెండు రోల్డ్  గోల్డ్ గాజులు, ఓ పూసల దండ. పొట్టిగా, తెల్లగా వున్న రమణమ్మ గారు తెలుగు. తమిళం, హిందీ, మరాఠీ, బెంగాలీ బాషలు గడ గడా మాట్లాడడం చూసి విస్తుబోయింది కమల. "అదేంటి ! మామీ! (అక్కడ అందరూ అలాగే పిలుస్తున్నారు)...ఇన్ని భాషలు మాట్లాడేస్తున్నారు, ఉండబట్టలేక అడిగేసింది. "అవునమ్మా! మా పూర్వీకం తూర్పు గోదావరి జిల్లా దగ్గర ఓ గ్రామం. ఇక్కడకు వచ్చి ముప్పై ఏళ్ల కఒటే ఎక్కువే అయ్యాయి! ఇక్కడే ఉండడంతో వంటలతో బాటు అన్ని భాషలు వాటంతట అవే వచ్చేశాయి..అంది ఆప్యాయంగా నవ్వుతూ. మరి మీ కుటుంబం..? ప్రశ్నార్ధకంగా చూసింది కమల. ఇక్కడే ఓ అద్దింట్లో వున్నాను. నేను ఈ కాశీవిశ్వనాధుడే నా కుటుంబం ..అంది దృడఒగా.వింటానంటే చెప్తాను నా గురించి అంది. అలాగే అంది కమల. మా అమ్మకు రాయడానికి ఫ్రీ గా ఓ కథ దొరికింది అన్నాడు  బాబు కన్ను గీటుతూ.మామి తన గతం చెప్పనారంభించింది.

*** *** *** *** ***

నాకప్పుడు పదమూడేళ్ళు. పెళ్ళంటూ ఏమిటో తెలియని వయస్సులో చదువుని ఆపి, మా అమ్మకు నా పెళ్లి ఇష్టం లేకపోయినా, బలవంతంగా  మా అత్త కొడుకుతో పెళ్లి చేయించారు మా నాన్నగారు. నా భర్త పచ్చి తాగుబోతు. సోమరి తాగి వచ్చి కొట్టేవాడు. ఎందుకీ విషయం దాచారని నా మేనత్తని అడిగాను ." పెళ్లి అయితే అంతా మారతాడనుకున్నాను. అందుకే చెప్పలేదు " అంది. నన్ను గుంటూరు దగ్గర వున్న వాళ్ళ గ్రామానికి తీసుకెళ్ళింది. ఇంటికి సరిగా రాడు. ఇంట్లో సరుకులు వుండవు. ఎప్పుడో రాత్రికి తాగి తిరిగి వచ్చేవాడు. వాళ్ల అమ్మ అస్సలు ఇంటి పట్టున వుండేది కాదు. ఏదో బంధువుల ఇంటికని , గుడికనో వెళ్ళుతూ వుండేది.రోజూ కొట్టేవాడు, ఏదో కులం తక్కువదాన్ని వుంచుకున్నాడని చెప్పుకునేవారు. నాకా కొత్త వూరు, చిన్న వయసు, కొత్త జిల్లా . చుట్టు ప్రక్కల వాళ్ల ఇళ్ళు గూడ చాలా దూరంగా ఉండేవి. తెలుగులో బాటు ఓ బావి, ఓ మర్రి చెట్టే నాకు స్నేహితులు ..తోడూ అన్నీ. అలా మూడేళ్ళు ఒంటరి జీవితం గడిపాను. అమ్మా నాన్నలను చూడాలంటే వెళ్ళనిచ్చేవాడు కాదు.వాళ్ళు వచ్చేవారు కారు. అమ్మ మాత్రం వారానికి ఓ  జాబు రాస్తుండేది. నేనేదన్నా రాసేస్తానని నేను రాసే ఉత్తరాలన్నీ చదివి పోస్ట్ చేసేవాడు. భయంతో ఏమీ రాయను.

ఓరోజు నేను కళ్ళు తిరిగి పడిపోయాను." నీ పెళ్ళాం గర్భంతో వుంది , జాగ్రత్తగా చూసుకో " అని ఓ ముసలావిడ చెప్పడం విన్నాను.నెలలు పెరిగే కొద్దీ బలహీనత, తిండి పెట్టడు. అమ్మకూ ఈ సంగతి రెండు సార్లు రాస్తే వాళ్ళకేం చెప్పక్కర్లేదులే "అంటూ ఉత్తరం చించేశాడు. ఊరికి వెళ్ళనీయడు. తీర్థ యాత్రల పేరున అత్తమ్మ వెళ్లి పోయింది. ఆ రోజునుండి ఘోర నరకాన్ని ఇక్కడే ఈ లోకంలోనే అనుభవించాను! దైవ కృప వల్ల ఓ రోజు నన్ను చూడడానికి అక్క బావ గారితో వెదుక్కుంటూ వచ్చింది. ఎప్పటిలాగే నాకు తిండి పెట్టక, గదికి తాళం వేసి బయటకు వెళ్ళాడు నా భర్త. అక్క కిటికీలోంచి నన్ను చూసి "అదేంటే? లోపల వున్నావ్! బయట తాళఒ వేసి వుంది...అని అడిగింది. జరిగినదంతా పూస గ్రుచ్చినట్లు ఓ ఖైదీలా నిలబడి ఏడుస్తూ చెప్పాను." పది రోజులనుండి తిండి లేదు ...నీళ్ళు మాత్రమే అక్కా! బాత్రూం కు కూడా పంపించి కాపలా కాస్తాడు, తను మాత్రం నా ముందే హోటల్ నుండి తెచ్చుకొని తింటాడు " అని ఏడుస్తూ చెప్పాను. రాత్రికి ఎప్పటిలాగా తాగి వచ్చాడు. కోపంతో బావగారు దవడ పగిలేంత లెంపకాయ కొట్టి తాళం చెవి తీశారు.

ఆ తర్వాత అక్కతోను బావతోను అనంతపురం వెళ్లి పోయా! వాళ్ళ ఇద్దరు పిల్లలు, నాకు పుట్టిన పాపతో అక్క ఇల్లే గతియని పడి వున్నాను. అక్కా బావలంటే నాకు అమ్మా నాన్నలకంటే ప్రాణం. అమ్మ నాన్నగారు పోయిన తర్వాత వదినల పోరు పడలేక అక్క అంచెన చేరింది. బావగారి ఒక్క జీతం. మేమా 7మంది. అద్దె కొంప. అమ్మా, నేను చిన్నగా వంటలు చేయడం మొదలు పెట్టాం. ఇరుగు పొరుగు వారికి ఊరగాయలు, పచ్చళ్ళు. పొడులు, వంటలు చేసి ఇచ్చేవాళ్ళం. జీవితం సాఫీగా సాగడం మొదలు పెట్టింది. విధి మమ్మల్ని వెంటాడం అక్కడితో ఆపలేదు . బంగారంలాంటి బావగారి మీద ఏదో తప్పుడు లెక్కలు ఎవడో చూపించి ఉద్యోగం నుండి పీకించాడు. అప్పుడే ఇల్లు ఖాళీ చేసి నాలుగు మూటలతో దేవుడి మీద భారం వేసి విరక్తితో కాశీ వచ్చేశాం.

కొత్త ఊరు, ఎక్కడ ఉండాలా? ఇంతమందికి ఎవరు ఆశ్రయం ఇస్తారు? అని అనుకుంటుండగా ఎవరో హరిశ్చంద్ర ఘాట్ దగ్గర చుట్టు ప్రక్కల అడిగి చూడండి అన్నారు. అప్పుడే రామ బ్రహ్మ గణపాటిగల్, అదే మీచే కర్మ కాండలు చేయించిన పెద్దాయన మావద్దకు వచ్చి "'మీలో ఎవరన్నా బాగా వంట చేయ గలరా ? మాకో వంటావిడ కావాలి అని మంచి తెలుగులో అడిగారు. దానికి నేను "అమ్మా, నేను చేస్తామండి .కాని మాకు ముందు ఉండడానికి కాస్త చోటు ఇప్పించండి అని "' చేతులు జోడించాను. దానికి ఆయన ఈ మాత్రానికే అంత భాధ ఎందుకమ్మా ? అంటూ మా ఇంటి మేడపైన ఓ పెద్ద హాలు, చిన్న వంట గది, బాత్ లెట్రిన్ తో సహా వుంది. ఓ మెస్ పెట్టండి తర్వాత అన్నీ విశ్వనాథుడు చూసుకుంటాడు " అని అన్నారు ఆప్యాయంగా. వెంటనే తన భార్యను పిలిచి " "సీతాలక్ష్మీ! ఇవా తెలుంగు బ్రాహ్మణా, పావం ఏళ్ళైళ, నంబ ఉదవలాం !(వీళ్ళు తెలుగు బ్రాహ్మలు, పాపం పేదవారు , మనం సహాయపడుదాం) అన్నారు. ఆవిడ చిరునవ్వుతో సరేనంది. వారిద్దరే మాకు ఆది దంపతులు. అమ్మా నాన్నా, దైవం అంతా. వాళ్ళ పిల్లలతో సహా మా పిల్లలు, మా వంటకాల రాబడి పెరిగింది. ఇక్కడే స్థిరపడ్డాం. అక్క కొడుకులు పై చదువులు చదివి అక్కను బావను కూడా తీసుకెళ్ళి హైదరాబాద్ లో సెటిల్ అయిపోయారు. నా కూతురికి కూడా తనే మంచి సంబంధం చూసి పెళ్లి చేయించింది. తను కూడా హైదరాబాద్ లోనే వుంది. ఇద్దరు పిల్లలు. అక్క పిలిచింది తనతో రమ్మని నేనే కాదన్నాను. ఆమెకు ఇంకా భారంగా వుండడం ఇష్టం లేక. ఓ పూట వంట చేస్తే ఇప్పుడు ఐదొందలు, అప్పుడు రెండొందలు. మూడు పూట్ల చేసేదాన్ని. కాశీలో నేను నా ముసలి తల్లి మిగిలాం. అమ్మా పోయి రెండు సంవత్సరాలు అయ్యింది. ఈ ఘాట్ లో గంగా లోనే కార్యాలు చేశాం. మా అక్క కొడుకే కొరివి పెట్టాడు. ఇప్పుడు నేనొక్కతనే ఇక్కడ మిగిలింది. ఇలా అన్నీ వంటలూ అందరికీ చేస్తూ అన్నీ బాషలు మాట్లాడుతూ జీవితాన్ని ఈడుస్తున్నాను ....అంది వెంకట రమణమ్మగారు గతం లోంచి తేరుకుంటూ.

“మరి మీ ఆయన ఏమయ్యాడు? ఎక్కడ వున్నాడు? ఏమన్నా తెలిసిందా? కుతూహలంతో అడిగింది కమల.” ’ఆ ఈ మధ్య భీమవరంలో ఆ కులం తక్కువ దాని ఇంట్లోనే పోయాడంట. అక్క బావలు వెళ్లి వచ్చారు,అందరికీ అత్త కొడుకేగా! నా కూతురు ,” ’ నా ముఖం కూడా చూడని తండ్రిని చూడడానికి ఇష్ట పడలేదని చెప్పేసింది ...అంది నిర్లిప్తంగా.” ’మీరు ?..సందేహంగా ప్రశ్నించింది కమల. “’లేదు! బంధుత్వమనేది కలసి ఉంటేనే తీగెలా అల్లుకుపోతుంది . తెగిపోతే ఏ సంబంధమన్నా తిరిగి అతుక్కోదు.” భార్యకు తిండి పెట్టని వాడు ఇప్పుడు భూమిపై లేడు. కానీ ఆవిడ రోజూ ఇపుడు పదిమందికి తన చేతులారా వండి పెడుతున్నది. ఏమి ! దైవ లీల! “అనుకుంది కమల. ఆవిడకో చీర కొనిపెట్టి, వందరూపాయలు ఇచ్చి అక్కడి నుండి కదిలింది కమల.

యాభై ఏళ్ల రమణమ్మ తన గతం చెప్తున్నప్పుడు కూడా కంట తడి పెట్టలేదు. ఎంతటి దృఢ సంకల్పం !! ఈవిడకున్న ధైర్యం. మనోస్థైర్యం, దృఢ నిశ్చయం, ఆత్మబలం , కఠిన పరిశ్రమ, నమ్మకం ఈ కాలం చదువుకున్న కాలేజి విద్యార్థులకెందుకు లేదు? ఊపిరుంటే ఉప్పు అమ్మి బతకొచ్చు అంటారే! పరీక్ష ఫెయిలయితే ప్రేమలో ఓడిపోతే వెంటనే ఆత్మహత్య చేసుకొని తల్లిదండ్రులకు కడుపు కోతెందుకు కలిగిస్తున్నారు? తనలో తానే ప్రశ్నించుకుంది కమల.




ఉదయం ఆరు కావొస్తోంది. ఆటో తుడుస్తున్నాను. ఈలోపు ఒకతనొచ్చాడు. "బాబు! పెండ్లికి బోవాల! వస్తావా?" అన్నాడు.

"పెళ్ళెక్కడ?" అన్నాన్నేను. "కుప్పిగంతుల పాలెం!" నొసలు చిట్లించి "అదేం ఊరు? అదెక్కడ?" అన్నాను. "దగ్గరే లేవయ్యా! గంట ప్రయాణం మధ్యాన్నంకల్లా రావొచ్చు. వస్తవా,రావా?" అన్నాడు.

నేను లెక్కలేసుకొని "రాను,పోను కలిపి మూడొందలవుతుంది" అన్నాను. "సరే! దగ్గర్లోనే ఇల్లు, పదా!" అంటూ ఆటోలో ఎక్కాడు.

*********************************

పది నిముషాలని ఇంట్లోకి దూరాడు. అర్ధగంటైంది. గుమ్మంలోకి చూసి చూసి మెడ నరాలు నొప్పెడుతున్నాయి. కేకలేసాను. అంగలేసుకుంటూ ఉరికొచ్చాడు. "ఎంతసేపండి?" కసురుకున్నాను. " అయిపోయింది, పప్పు తాలింపేసేసరికి కాస్త లేటయింది. ఒక్క నిముషమం"టూ మళ్ళీ ఇంట్లోకురికాడు. 'పొయ్యేది పెళ్ళికి, పప్పేమో తాలింపా?" నాకతని మాట మింగుడు పడలేదు. దగ్గర్లేడుగానీ ఉంటే చెంపలు వాయించాలన్న కసి..అయినా నాకెందుకులే అని సర్దుకున్నాను.

తలుపులేసి బయటకొస్తున్నారు. వాళ్ళను చూసినోడల్లా 'ఓరి వీళ్ళ వేషాలో!" అని అనుకోకుండా ఉండలేరు. ఆది దంపతుల్లా మెరుస్తున్నారు. ఆమె మల్లె తీగకు చీర కట్టినట్టుంది. అతను బండరాయికి బట్టలు తొడిగినట్టున్నాడు. ఇద్దరూ హాఫ్ సెంచరీ దాటుంటారు. కానీ వాళ్ళేసుకున్న బట్టలు ట్వంటీ ప్లస్ వారివే!. ఆమె కాస్త పొట్టి కావటం వల్ల చీర నేలను ఊడుస్తోంది. అతను పొడుగరి. లావు ఉండడం వల్ల చొక్కా ఒంటికి అతుక్కుపోయి కొంత శరీరాన్ని గాలికొదిలేసింది. ప్యాంటేమో ఫుల్ కాదు, హాఫ్ కాదు, మిడిలేజ్. మిడిలేజేంటని ఎందుకన్నానంటే మోకాళ్ళ నుండి జానెడు మాత్రమే క్రిందకుంది. గుండ్రటి బొట్టు. ఆయినిది నిలువు బొట్టు. నాకు నవ్వాగితే ఒట్టు. పగలబడి నవ్వితే బాగోదనుకుని పెదాలను పండ్లతో కొరికి పట్టాను.

రెండు చేతి సంచులతో ఆటోలో కూలబడ్డారు. ఆటో సిటీ దాటింది. "పెళ్ళి ఎవరిది సార్?" అన్నాను ప్రయాణంలో హుషారు రావడానికి. "ఎవడిదోలే పెళ్ళి! గమ్మున పోనీ! ఇంకోసారి పెళ్ళి మాటెత్తావంటే గబాలున బయటికి దూకుతా!" అన్నాడు. అన్నంత పని చేస్తాడేమోనని కాసేపు వణికి సచ్చాను. ముఖాన పచ్చ గడ్డి వేస్తే భగ్గుమంటుందనే సామెత అతన్ని చూసాకే నిజమనిపించింది. ఆమైతే ఎవడో గుద్దినట్టే పెట్టుకుంది ముఖం. 'పెళ్ళికి ఆటో పిలిచిందీడే....పప్పు వండుకుంది వీళ్ళే....పెళ్ళి ఎవరిదని అన్నందుకు పటపటమని పళ్ళు కొరుకుతాడా...వీడి దుంపతెగ..."సావు కోపం వస్తుంది కానీ నేనేమో ఒక్కణ్ణి. వీళ్ళు ఇద్దరు. వియ్యానికైనా, కయ్యానికైనా సమ ఉజ్జీలు కావాలంటారు. సంఖ్యా బలం కుదరక ఊరుకున్నాను. ఏం చేస్తాం, అన్ని రోజులు మన చేతిలో ఉండవు మరి.

*****************

కుప్పి గంతుల పాలెం...

బోర్డు చూడగానే నాకు ప్రాణం లేచొచ్చింది. వెనక్కి చూద్దును కదా, ఎవరూ సోయిలో లేరు. ఒకళ్ళ మీద ఒకళ్ళు పడి ఒకరి గాలి ఒకరి మీదకు వదులుకుంటున్నారు, ఇద్దరివీ రెండురకాల గురకలు. సన్నాయి మేళం, డోలు వాయిద్యం రెంటిని కలిపి ముక్కులో పోసినట్టే అనిపిస్తోంది. "సార్" గట్టిగా పిలిచాను. శరీరం కదిలింది కానీ కళ్ళు మాత్రం తెరుచుకోలేదు. 'భలే బేరమే' అనుకున్నాను. హారన్ ఆగకుండా ఒత్తి పట్టుకున్నాను. బెలూన్లో గాలి కొట్టినట్టే టక్కున లేచి కూర్చున్నారు. " ఏందయ్యా గోల..బంగారం లాంటి నిద్ర పాడు చేసావ్?" చికాకుగా అన్నాడు. "ఊరొచ్చింది సార్! ఎటెల్లాలి?" మెల్లగా అన్నాను.

"ఆగా"గని ఎవరికో ఫోన్ చేశాడు. ఫోన్ మాట్లాడి పెదవి విరిచాడు. "మన కర్మ కాలిందే! పుర్రెకో బుద్ధన్నట్టు లాలయ్య తన పెళ్ళి అడవిలో ఖరారు చేశాడు." భార్యతో అన్నాడు. " సరిపోయింది సంబడం" అన్నదో లేదో మళ్ళీ ముఖం మాడ్చుకుంది. పెళ్ళేందో, అడవేందో....... అసలేం జరుగబోతోందో..... నాలో మళ్ళీ వణుకు....బేరం ఒప్పుకున్నాక తప్పుతుందా? మొత్తానికి రెండు కిలోమీటర్లు చెట్లలోనే వెళ్ళాం. ఖాళీ స్థలంలో పోగుపడిన గుంపు కనబడింది. ఆటో ఆపాను.ఆపాను. నన్నే మాత్రం పట్టించుకోకుండా వారిద్దరూ హడావుడిగా వెళ్ళి గుంపులో కలిశారు. నేను భారంగా నిట్టూర్పు వదిలి, ఆటోలో కూర్చొని పెళ్ళి తంతు చూడడం మొదలు పెట్టాను.

ఏ జన్మ పాపమో, ఈ పెళ్ళి రూపంలో నను పీడిస్తోంది. నవ్వాలో, ఏడ్వాలో అంతు బట్టడం లేదు.ఎండా కాలం పైగా పన్నెండు కావొస్తోంది. ఒక్క టెంట్ లేదు. అందరూ మండుతున్న ఎండలో....కారుతున్న చెమటతో అపసోపాలు పడ్తూ...పెళ్ళి చూస్తున్నారు. దాదాపు అందరి బట్టలు నీళ్ళల్లో నానబెట్టినట్టే తడిసాయి. నేల కాలుతుంది కాబోలు కొందరు పక్షి రెక్కల్లా కాళ్ళను ఆడిస్తున్నారు. చిన్న పిల్లలు కర్చీఫ్ లు, కండువాలను దగ్గర్లోని వాగులో ముంచి, తీసుకొచ్చి తమ తల్లిదండ్రుల ముఖాలపై పిండుతున్నారు.

రెండు ఇసుక కుప్పలపై వేసిన పీటల్లో వధూవరులు కూర్చున్నారు. అయ్యగారు మాత్రం నిలబడే మంత్రాలు చదువుతున్నారు. ఉక్కపోతకు కాబోలు అయ్యగారి కంఠం పలురకాలుగా మోగుతూ...మైక్ ను తలదన్నుతోంది. కాసేపటి తర్వాత పట్టు వస్త్రాలు కట్టుకు రమ్మని పెళ్ళికొడుకుని చెట్లలోకీ, పెళ్ళికూతురిని వాగు పక్కకీ పంపించారు. పావుగంట గడిచింది. పెళ్ళికూతురు వాగులో పడిందనే కేకలు, బంధువుల్లో కొంతమంది జింకల్లా పరిగెత్తి పెళ్ళికూతురి రెండు రెక్కల్ని పట్టుకొచ్చి పెళ్ళి పీటలపై కుదేసారు. తర్వాత రెండు బేసిన్ల లో సిద్ధంగా ఉన్న తలంబ్రాలు వధూవరులు పోటీపడి ఒకరి మీద ఒకరు పోసుకున్నారు. తదుపరి అయ్యగారు "మాంగల్యం తంతునానేనా..." అంటూండగా పెళ్ళికొడుకు మంగళసూత్రం కట్టాడు.

రెండు, మూడు వరుసలుగా ఇసుక, మట్టి కలిసిన నేలపై భోజనానికి కూర్చున్నారు. చిన్నగా వెళ్ళి నేను ఓ వరుసలో చేరాను. అరచేయి కంటే కొంచెం పెద్దగా ఉన్న మోదుగు ఆకులను అందరి ముందు పరుస్తున్నారు. నాకైతే నోటమాట రాలేదు. పక్కనతనికి

కనుసైగలతోనే ఆకు చూపించాను. అతను వేలును నోటికి నిలువుగా పెట్టుకున్నాడు. మూసుకొని తినవోయ్ అన్నట్టు అర్థమైంది నాకు. వడ్డిస్తూంటే అందరి ఆకులను పరిశీలన చేయసాగాను. ఖచ్చితంగా పిడికెడంటే పిడికెడు అన్నం, అరగంటె పప్పు, గిద్దెడు సాంబారు, రెండు స్పూన్లంత మజ్జిగ, స్వీట్ గా జాంగ్రీని ఒకాయన విరుచుకుంటూ చేతికొచ్చినంత ఆకులోకి విసిరేసిపోతున్నాడు. ఓ వైపు వడ్డించడమే కాలేదు. మరోవైపు లైన్లు లేచి, వాగులో చేతులు కడుక్కుంటున్నాయి. నాకు కలో, నిజమో తెలియట్లేదు. వడ్డించిన ఆకును అలాగే మడిచి ఇసుక కింద కప్పెట్టాను. ఉసూరుమనుకుంటూ వెళ్ళి వాగులో నీళ్ళు తాగుతున్నాను. ఈ లోపు అందరూ పరుగులు తీస్తున్నారు. తలో దిక్కున చేరి, తెచ్చుకున్న భోజనం విప్పుకుంటున్నారు. నా ఆటోలో వచ్చిన వాళ్ళు కూడా క్యారేజ్ విప్పి అన్నంలో పప్పుచారు జుర్రుకుంటూ, ఆకలిని తంతున్నట్టే తింటున్నారు.

నేను అప్పటికే సగం చచ్చాను. కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి వారి పక్కన కూలబడ్డాను. మాటవరసకైనా అన్నం తినమమంటారని ఎదురుచూసాను. పొరపాటున కూడా ఆ భాగ్యం కలుగలేదు. అయినా నాకు కించిత్తు బాధలేదు.కాని ఈ పెళ్ళేంది? అన్నం వండుకొని రావడమేంది? తెలుసుకోవాలనే ఉత్సాహం ఎక్కువైంది.

" సార్!" పిలిచాను. అన్నం ముద్ద సగం నోట్లోకి సగం బొచ్చెలోకి పడ్తుంటే, "ఏంది?" అన్నాడు. "ఎంత అడుక్కు తినేటోడు అయినా, భోజనం పెట్టకుండా పెళ్ళి చేసుకోడు...ఈ దిక్కు మాలిన ఖర్మేంటి సార్?" అన్నాను. " ఇది రెండోపెళ్ళయ్యా" అన్నాడు.

" ఆ...?" నా పెదాలు తెరుచుకొని అలాగే నిలబడ్డాయి. " రెండో పెళ్ళా?" అన్నాను. " రెండో పెళ్ళంటే రెండోదని కాదు....వధూవరులు వీళ్ళే.వీళ్ళకే మళ్ళీ పెళ్ళి.!" నాకు సర్రున కాలింది. "ఎట్టెట్టా?" పండ్లు కొరుకుతూ అన్నాను.

" మాకో ఆచారం తగలడింది. అమ్మాయి ఇంట్లో పెళ్ళి జరిగినప్పుడు అబ్బాయి తరపు బంధువులను సంతృప్తి పర్చలేకపోతే అబ్బాయి తరపు వాళ్ళు ప్రతీకార పెళ్ళిని ఏర్పాటు చేస్తారు. వారు చేసిన మర్యాదలను ఎత్తిపొడుస్తూ అన్నం వడ్డిస్తారు. దీన్లో మరో మలుపేంటంటే బంధువులు ఎవరి భోజనాలు వారే తెచ్చుకోవాలి. అలాగని పెళ్ళికి రాకుంటే ...భోజనాలు తేకుంటే వారికి చుట్టరికాలు బంద్. ఎవరూ వాళ్ళింటికి వెళ్ళరు. ఒక విధంగా కులం నుంచి వెలేసినట్టే.

మర్యాదలకు లోటు రానియకని అమ్మాయి తండ్రికి చిలక్కి చెప్పినట్టు చెప్పా. వాడు వినకపోగా, బావా, ఈ ఆచారం మన తాత ముత్తాతల నుండి చెప్పుకోవటమే కాని ఏనాడూ ప్రతీకార పెళ్ళిని చూడలేదు. దానిని జరిపించి మూలపురుషుడిని అవుతానని ప్రతిజ్ఞ చేసినాడు. దాని ఫలితమే, ఈరోజు ఇన్ని కష్టాలు." చెప్తూనే మళ్ళీ ముద్దను నోట్లోకి నెట్టనే నెట్టాడు. ముద్ద మింగి ఇకిలిస్తూ "అయినా, మనం వండుకున్న అన్నం మనం తినడానికి నామర్దా ఎందుకోయ్!" అన్నాడు.

తిక్క మనుషులు ఉంటారని వినడమే కానీ, ఎప్పుడూ చూసింది లేదు. అదిప్పుడు ప్రత్యక్షంగా అనుభవించాను. 'ఓరి వీళ్ళ ప్రతీకారం పాడుగానూ! ఆచారం, సంప్రదాయం గంగలో కలిపెయ్య, ఈ పెళ్ళి లోకానికే విడ్డూరంగా ఉందీ మరుగుతున్న నీళ్ళలాగైంది నా మనసు. మెల్లగా పైకి లేచాను. " సార్! సెంటర్ కెళ్ళి పెట్రోల్ పోయించుకొస్తాను...డబ్బులియ్యండి" అన్నాను.

నన్ను పరిశీలనగా చూశాడు. నమ్మకం కుదరలేదో ఏమో... మాట్లాడుకున్న బేరం కంటే వంద తక్కువ ఇచ్చాడు. బ్రతుకు జీవుడా అనుకుంటూ ఆటోలో పడ్డాను. వెందిరిగి చూస్తే ఒట్టు.....




బాగన్న జోగన్న చిన్ననాటినుండి స్నేహితులు,

ఇద్దరు ఎంత స్నేహితులంటే...... ఒకమంచంలో తిని ఒక కంచంలో పడుకునేంత ....ఛీ ... ఛీ ........ఒక కంచంలో తిని ఒక మంచంలో పడుకునేంత దగ్గరి స్నేహితులన్నమాట.

ఇద్దరి ఆదర్శాలు ఒక్కటే! నాస్తికత్వం. దేవుడు లేడు దయ్యము లేదని ఇద్దరు గంటలగ్గంటలు ఆ దేవుని తిడుతూ మాట్లాడుకోడమే వారి పని.

అలాంటి స్నేహితులు చాలా రోజులుగా దూరమయ్యారు. కోపంతోనో మనస్పర్థల తోనో కాదండోయ్ ....

జోగన్నకు ఉత్తరప్రదేశ్ లో ఉద్యోగం వచ్చింది మరి.... వెళ్ళక తప్పని పరిస్థితి... వెళ్ళాడు.

చాలారోజుల తర్వాత ....... ఆరోజే జోగన్న బాగన్నను చూడ్డానికొచ్చాడు. బాగన్నకు చిన్న నాటి ప్రాణమిత్రున్ని చూడగానే సంతోషమేసింది.

లోకాభిరామం మాటాడుతూ కూర్చున్నారు ఇద్దరు. ఉన్నట్టుండి జోగన్న బాగన్నను.

"ఒరా బాగులూ! నువ్వు దేవున్ని నమ్ముతున్నావా?" అని అడిగాడు,

అలా అడుగుతున్న మిత్రున్ని ఆశ్చర్యంగా చూసి నమ్మనన్నట్లు తలనడ్డంగా వూపుతూ

"అదేం అలాఅడుగుతున్నావ్ , నేను మొదటినుంచి కూడా నమ్మనుకదరా....నీకూ తెలుసుగా! " అన్నాడు.

వెంటనే జోగన్న " హమ్మయ్య ఐతే నువ్ మారలేదన్న మాట నిదగ్గర గడపొచ్చన్నమాట " అంటుంటే మరింత ఆశ్చర్యంతో బాగన్న

"నువ్వు కూడా నమ్మవుగా! మరిరోజు ఇలా అడగడమెందుకు?" అన్నాడు ఆశ్చర్యంగా...

"నేను నా నమ్మకాన్ని మార్చుకున్నాలే!" అన్నాడు జోగన్న

" ఆహా! ఎప్పటినుండేమిటి?" బాగన్న వ్యంగ్యం

"దయ్యాలున్నాయని నమ్మకం ప్రారంభమైనప్పటినుండి " చెప్పాడు జోగన్న.

" అలాగా! దయ్యాలనెప్పటి నుండి నమ్ముతున్నావేంటి?" అడిగాడు

"ఆర్నెల్ల క్రితం యుపిలో ఓ పేద్ద రైలు ప్రమాదం జరిగింది చూడు ఆరోజు నుండి" జోగుచెప్పగానే "హహహహహ! ఇవే మూడనమ్మకాలు రైలు ప్రమాదానికి దయ్యాలకేంటీ సమ్మందం ఇలా చెడిపోయావేంటి? నువ్వు" అన్నాడు బాగన్న మాటల్లో హేళన.

" ఔను! ఆరైలు ప్రమాదంలో చనిపోయిన నాలుగు వందలమంది ప్రయాణీకులలో నేనూ ఒక్కడినికదా! అందుకే ఆరోజునుండి దయ్యాలున్నాయని నమ్ముతున్నా" నంటూ చెప్పి

అంతలోనే మాయమైపోయాడు.

అంతే బాగన్న శరీరం చమటలతో తడిసి ముద్దైంది.




రిటైరై రెండు నెలలైన రాఘవకి ఏమీ తోచడంలేదు. హాయిగా మనవడు, మనవరాలితో కాలక్షేపం చేస్తూ కథలు చెప్పే వయస్సు. ఇద్దరమ్మాయిలూ అమెరికాలో వుండడం వల్ల ఆ అదృష్టం లేకుండా పోయింది.

శ్రీమతి సహాయంతో పిల్లల బాధ్యత బాగానే పూర్తి చేశాడు. తల్లిదండ్రులను చివరివరకు కనిపెట్టుకుని ఆ కార్యం కూడా సక్రమంగానే నిర్వర్తించాడు. ఇక మిగిలింది, బ్రతికుండగా సమాజానికి ఏదో విధంగా ఉపయోగపడటం, ఏం చేస్తే కాలక్షేపంగా వుంటుంది? అలా అని నలుగురికి ఉపయోగపడుతుంది అనే ఆలోచనలో వున్నాడు.

ఉదయం తొమ్మిది అవుతోంది. పేపర్ చదవడం, టిఫిన్ తినడం పూర్తిచేసి, పోర్టికోలో కూర్చుని, వీధిలో వచ్చేపోయేవాళ్ళని చూస్తున్నాడు. సైకిల్ మీద స్కూల్ కి వెళ్తున్న పిల్లలు, బళ్ళ మీద పిల్లల్ని ఎక్కించుకు వెళ్తున్న తల్లిదండ్రుల్ని చూశాక, ఆ సందు చివర వున్న స్కూల్ గుర్తుకు వచ్చింది.

స్కూల్ జ్ఞాపకం రాగానే, మనసు బాల్యం లోకి జారుకుంది. తను, పక్కింట్లో గోపాల్ కలిసి 2 కిలోమీటర్ల దూరం వున్న బడికి

వెళ్ళేవాళ్ళు. పొద్దున అసెంబ్లీ - వందేమాతరం, సాయంత్రం అసెంబ్లీ - ఎక్సర్ సైజులు, జనగణమన వుండేవి. వారం లో ఒక పి.టి. క్లాసు వుండేది. అందరూ ఆ పీరియడ్ కోసం ఎదురుచూసేవాళ్ళు. బడి చుట్టూ బోలెడు ఖాళీ వుండేది. పెద్ద చెట్లతో వుండేది. కబాడి, ఖొ ఖొ లాంటి ఆటలు ఆడేవాళ్ళు.

ఇవన్నీ గుర్తు వచ్చి, ఇంటి దగ్గర స్కూల్ ఎలా వుందో? ఒకసారి చూద్దాం అనే కుతూహలం కలిగించింది. లేచి మెల్లగా స్కూల్ వైపు నడక సాగించాడు.

"భారతి స్కూల్" ఒక రెండు అంతస్థుల భవనం లో నడుస్తోంది. సెల్లార్ లో మొక్కల కుండీలు అందం గా అమర్చి వున్నాయి. సైకిళ్ళు, బళ్ళు పక్కకు వున్నాయి. ప్రిన్సిపాల్ గది మొదటి  అంతస్థులో వుంది. గది బయట  డా గిరిజ అని అందమైన నేం ప్లేట్ గోడకు పెట్టి వుంది.

"ఎవరు కావాలి సార్" అని అడిగింది అటుగా వెళ్తున్న ఆయా.

"ప్రిన్సిపాల్ గారిని కలవాలి" అన్నాడు రాఘవ.

లోనకు  వెళ్ళి మాట్లాడి , అప్పుడు గదిలోకి పంపింది ఆయా.

కుర్చీలో వున్నావిడకి 40 సంవత్సరాలు వుండొచ్చు. సరిపడా ఎత్తు, చామనచాయ, మొహం గుడ్రం గా వుంది.

"చెప్పండి సార్" అంది ఆమె.

"నా పేరు రాఘవ. ఈ వీధిలోనే మా ఇల్లు" అని తన గురించి, ప్రస్తుతం రిటైరయ్యాక, తన ఆలోచన గురించి చెప్పాడు.

గిరిజ తను లెక్కలలో పి.హెచ్.డి చేసి ప్రైవేటు కాలేజీలో 10 ఏళ్ళు పనిచేసినట్లు చెప్పింది. క్లాసులో సగం మంది పిల్లలకి సబ్జెక్టు పూర్తిగా అవగాహన లేకపోవడం గమనించి, వీళ్ళకి ముందునుండే బలమైన పునాది వెయ్యడం అవసరం అని తలచి, కాలేజ్

ఉద్యోగానికి రాజినామా చేసి, 4 ఏళ్ళ క్రితం ఈ స్కూల్ ప్రారంబించినట్లు తెలిపింది. "రండి సార్, పైన క్లాసులు చూద్దురు గాని" అని పైకి తీసుకెళ్ళింది. కె.జి నుండి ఏడవ తరగతి వరకు మొత్తం 9 క్లాసులున్నాయి. కారిడార్లో అక్కడక్కడ చక్కటి నీతివాక్యాలు వ్రాసి వున్నాయి. క్లాసులో పాఠాలు జరుగుతున్నాయి. తిరిగి కిందకు వెళ్ళారు.

"మీ స్కూల్ కి నేనేమన్నా ఉపయోగపడగలనేమో ఆలోచిస్తానమ్మా" అని చెప్పి సెలవు తీసుకున్నాడు.

ఏమండీ! భోజనానికి రండి" అన్న భార్య సునంద కేక విని పోర్టికోలోని పడక కుర్చీ నుండి లేచి లోపలకి వెళ్ళాడు.

బోజనం అయ్యాక సునంద దగ్గర తన నిర్ణయాన్ని వెలిబుచ్చాడు. ఈ తరం వాళ్ళకి పిల్లలకి కథలు చేప్పే తీరిక లేదు. అలా అని తాతో, బామ్మో చెప్పడానికి వాళ్ళతో కలిసి వుండడం లేదు. ఆఖరుకి కథలు వినడానికి కూడా పిల్లలు "గ్రాండ్ మా స్టోరీస్" అని ఇంటర్నెట్ మీద ఆధారపడవలసి వస్తోంది.     అందుకని రోజూ స్కూల్లో చిన్న పిల్లలకి కాసేపు నీతి కథలు, ఇంకొంచెం పెద్ద భారతం, రామాయణం వంటివి చెబుదామని వుంది అన్నాడు.

పోనీలెండి.. మనవళ్ళకి చెప్పలేకపోతున్నామనే బాధ అనవసరం. ఇది ఇంకా ఎక్కువమందికి ఉపయోగపడుతుంది. పిల్లలకు పుస్తక పఠనం మీద ఆసక్తి కూడా పెరుగుతుంది. అంది సునంద.

పక్కరోజు ఉదయం 10 గంటలకి స్కూల్ వెళ్ళాడు. గిరిజను కలిసి తన ఆలోచనను వివరించాడు.

"బాగుంది మాస్టారు! చిన్న     పిల్లలకు వారానికి ఒక క్లాసు నీతి కథలు, పెద్ద పిల్లలకు రామాయణం, భారతం ప్లాన్ వేద్దాం" అంది.

ఎలాగు జూన్ నెల సంవత్సరం ప్రారంభం లో వున్నాం అని రాఘవ పేరును కూడా చేర్చి, టైం టేబుల్ ను అడ్జస్ట్ చేసింది గిరిజ. రోజూ స్కూల్ కి వెళ్ళి వస్తున్నాడు అతను.

లోకం తెలియని చిన్న పిల్లలు జంతువుల మీద, పక్షుల మీద కథలు చెబుతుంటే వినోదంగా, ఆశ్చర్యం గా కళ్ళు ఇంత చేసుకుని వింటుంటే రాఘవకి ఎంతో సంతోషం గా వుంది. భారతం వినడానికి పెద్ద పిల్లల ఆసక్తి, మళ్ళా క్లాసు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడటం, కథ ఎంతవరకు అయ్యిందర్రా అనగానే చెప్పడం, అతని ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. అతని ధ్యాస అంతా ఈ

పిల్లలకి ఇంకా ఏం చేస్తే బాగుంటుంది అనే. మెల్లగా స్కూల్ అసెంబ్లీ ఏర్పాటు చేసే ప్రయత్నం చేసాడు. "అంత స్థలం మనకు లేదు కదా మాస్టారూ" అంది గిరిజ.

"ఎవరి క్లాసులో వాళ్ళు నుంచుని వుండగా మైక్ సిస్టం తో వందేమాతరం, జనగణమన చెప్పిద్దాం" అన్నాడు.

ఒక వారం లో దాన్ని కార్య రూపం లోకి తెచ్చాడు.

ఒకరోజు స్కూల్ నుండి ఇంటికి వస్తుండగా దారిలో ఖాళీ సైటు చూసి బుర్రలో తళుక్కున ఒక ఆలోచన తట్టింది. మర్నాడు ఉదయం గిరిజతో ఈ సందులో ఒక్క సైటే ఖాళీగా వుంది. రెడ్డిగారు తప్ప అందరూ ఇల్లు కట్టేశారు. ఆయన ఇక్కడ వుండరు. ఆయనను సంప్రదించి సైటు లీజుకు తీసుకుందాం. పిల్లలకి ప్లే గ్రౌండ్ గా పనికొస్తుంది. అన్నాడు.

తప్పకుండా ఆ సాయంచెయ్యండి. మాస్టారూ! ఆయనెవరో నాకు తెలియదు అంది.

పది రోజులలో ఎలాగైతే ఆ పని సాధించాడు రాఘవ. ఇప్పుడు పొద్దున ఒక్క పూటే కాదు, సాయంత్రం కూడా స్కూల్ కి వెళ్ళడం, పీటి క్లాసుల్లో పిల్లోలు ఆ ఖాళీ స్థలం లో కేరింతలతో ఆటలాడుతుంటే చూస్తూ కూర్చోవటం అలవాటైపోయింది. మధ్య మధ్య వాళ్ళని ఉత్సాహపరచేవాడు. స్కూల్ నుండి ఆటల్లో పాల్గొనడానికి ఒక గట్టి టీం ను తయారుచేయుటకు ఒక పీటి మాస్టర్ ని నియమించడం కూడా జరిగింది. వర్షాకాలం లో స్కూల్ పిల్లల్తో ఆ వీధంతా పూలమొక్కలు నాటించాడు. పెద్ద పిల్లలు ఒక బృందం గా ఏర్పడి ఆ వీధిలో ఇళ్ళిళ్ళళ్ళో వారిందరినీ కలిసి స్వచ్ఛభారత్ కార్యక్రమం లో భాగంగా ఆ రోడ్డు మీద ఎక్కడా చెత్తపడెయ్యవద్దని, ఎవరి ఇంటి ముందున్న మొక్కల్ని వారే పరిరక్షించాలని వాళ్ళని కూడా భాగస్వాముల్ని చేశారు.

చూస్తూ సంవత్సరం గడిచింది. ఆ సంవత్సరం ఏడవ తరగతి పిల్లలు వేరే స్కూల్ కి వెళ్ళడానికి ఇష్టపడలేదు. చాలామంది తల్లిదండ్రులు కూడా గిరిజను కలిసి పిల్లలను ఐదవ తరగతి దాకా ఇక్కడే చదివేలా ఏర్పాటు చెయ్యమని, అవసరమైతే వాళ్ళ సహకారం కూడా వుంటుందని చెప్పారు. గిరిజ, రాఘవ సలహా మీద లోన్ తీసుకుని, పైన ఇంకో ఫ్లోర్ వెయ్యాలని నిర్ణయించుకుంది. నిర్మాణం పని మొదలయ్యింది. మధ్యలో ఆడపిల్లల ఇద్దరి డెలివరికి సునంద అమెరికా వెళ్ళింది. తనని రమ్మన్నా, నిర్మాణం పని అది చూసుకోవాలని వెళ్ళలేదు.

రోజులు గడుస్తున్నాయి. స్కూల్తో అనుబంధం రాఘవకి కాలక్షేపం తో పాటు ఎంతో సంతృప్తినిస్తోంది. వీధిలో అందరూ రాఘవని

పలకరించేవారే. పిల్లలకి, వాళ్ళ తల్లిదండ్రులకి అందరికీ అతను మాస్టారే!

తల్లి ద్వారా విషయాలన్నీ తెలుసుకుంటున్న శారద, లలిత ఎప్పుడు తండ్రితోపాటు, స్కూల్ ను అక్కడ పిల్లలను చూద్దామా అని

ఆరాటపడుతున్నారు. అమెరికా వెళ్ళలేదన్న మాటేగాని రాఘవకి కూడా ఎప్పుడెప్పుడు మనవడిని, మనవరాలిని చూద్దామా! అని వుంది. కొత్త సంవత్సరం వచ్చింది. కూతుళ్ళు, అల్లుళ్ళు మనవరాళ్ళ సంతానం రానే వచ్చారు. రోడ్డుకు ఇరుపక్కల విరగబూసి వున్న గన్నేరు, గరుడ వర్ధనం చెట్లు వాళ్ళకు స్వాగతం చెబుతున్నాయన్నట్లుంది. మనవడిని, మనవరాలిని చూసి మురిసిపోయాడు రాఘవ.

మరుసటి రోజు అందరినీ స్కూల్ కి తీసుకెళ్ళాడు. వాళ్ళను గిరిజకు పరిచయం చేశాడు. పిల్లలందరికీ చాక్లెట్లు పంచారు.

శారద, లలిత రోజూ స్కూల్ వదిలే సమయానికి పోర్టికోలో కూర్చుంటే, స్కూల్ ఉనికిని తెల్లుపుతూ గాలిలో మంద్రం గా "జనగణమన అధినాయక జయహే..." అని జాతీయ గీతం వినిపించేది. ఇళ్ళకి వెళ్తూ స్కూల్ పిల్లలు వీళ్ళకు "బై" చెబుతూ వెళ్ళేవాళ్ళు. పుట్టినరోజు వేడుకలు అయిపోయాయి. నాలుగు వారాల ట్రిప్ చివరకు వచ్చేసింది. ఆ రోజు సాయంత్రం అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నప్పుడు కూతుళ్ళిద్దరు తల్లిదండ్రుల్ని ఇక్కడ ఒక్కరే వుండి ఏం చేస్తారు? అమెరికా వచ్చెయ్యమని అన్నారు. ఈ సంవత్సరం 10వ క్లాసు వరకు పెంచుతున్నాం. వాళ్ళకి వ్యక్తిత్వ వికాసానికి క్లాసులు ఏర్పాటు చేయాలి. క్విజ్ పోటీలకు తయారుచేయాలి. ఇలా చాలా ఆలోచనలు వున్నాయి. ఆచరణలో పెట్టాలి" అన్నాడు రాఘవ.

ఎప్పుడన్నా చూడాలనిపించి వస్తారేమో కానీ అమెరికాలో వుండిపోయేటట్లురారు అని అర్ధమయ్యింది. మరుసటి రోజు శారద, లలిత స్కూల్ కి వెళ్ళి గిరిజకు వాళ్ళిద్దరి తరుపున స్కూల్ అభివృద్ధికి ఖర్చు చెయ్యమని లక్ష రూపాయలు విరాళం గా ఇచ్చి ఆమెను ఒక చిన్న సహాయమ ఆర్ధించారు. వాళ్ళ నాన్న కథలు చెప్పే కార్యక్రమాన్ని రికార్డు చేసి తమకి పంపమన్నారు. ఇంతమంది పిల్లలు ఆ కథలు వింటుండగా, సొంత మనవడు, మనవరాలికి కూడా ఆ భాగ్యం దక్కాలని, పిల్లలు పెద్దయ్యాక వాళ్ళకి బెడ్ టైం స్టోరీస్ గా వినిపిస్తామన్నారు.

రాఘవ, సునంద అమెరికా రాకపోయినా, వాళ్ళకి కాలక్షేపానికి లోటు లేదని, ఈ వయస్సులో కూడా జాతి నిర్మాణానికి కృషి చేస్తున్న వాళ్ళ నాన్నకు తాము దగ్గరలేకపోయినా, కొండంత అండ వుందనే భరోసాతో తిరుగు ప్రయాణమయ్యారు శారద, లలిత.




‘విశాఖ ఏజెన్సీలోని కొండరాయపల్లి గిరిజన తండాకి సమీపంలో పోలీసులకు, నక్సలైట్లకూ నడుమ ఎదురు కాల్పులు జరిగాయి. రాత్రి పదకొండు గంటల నుండి ఉదయం ఐదు గంటల వరకు సాగిన ఆ పోరులో సుమారు ఇరవై మంది నక్సలైట్లు పాల్గొన్నట్టు సమాచారం. ఆ ఎదురు కాల్పులలో ఓ మహిళతో సహా ఇద్దరు నక్సలైట్లు మృతిచెందితే, మిగతావారు తప్పించుకోవడం విశేషం. మృతుడు స్థానిక దళ నాయకుడు లక్ష్మా నాయక్ గా గుర్తింపబడింది. మహిళ వివరాలు ఇంకా తెలియరాలేదు. మృతుల వద్ద రెండు కిట్ బ్యాగ్ లు, రెండు ఎ.కె-47 తుపాకులు, మ్యాగజీన్సు, ఒక క్లేమోర్ బాంబు, నక్సల్ లిటరేచరు పోలీసులకు లభ్యమయ్యాయి. ఆ సంఘటనలో నలుగురు పోలీసులు గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. తప్పించుకున్న నక్సలైట్ల కోసం 'కోబ్రా' టీమ్ అడవిలో తీవ్రంగా గాలిస్తోంది...’

ఆ వార్త ఆ మన్య ప్రాంతాన్ని గట్టిగా కుదిపేసింది. ముఖ్యంగా, కొండరాయపల్లి తండాని. ఎదురు కాల్పులు జరిగిన స్థలం ఆ గిరిజన తండాకి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండడమే అందుక్కారణం.

ఆ సంఘటనను గూర్చి ఆలకించినప్పట్నుంచి ఆ తండావాసులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని, గుమ్మం దాటి బైట అడుగు పెట్టడానికి భయపడుతున్నారు. ఆ పరిసరాలలో ఎవరు కనిపించినా పోలీసులు అనుమానంతో కొట్టి, వ్యాన్ లో పడేస్తారు.

నక్జలైట్లతో వారికి సంబంధం అంటగట్టడానికి ప్రయత్నిస్తారు.

ఇక 'అన్నల' మాట సరేసరి. తమ ఉనికిని గూర్చి పోలీసులకు సమాచారం ఇచ్చారంటూ హింసిస్తారు. తాము ఏ పాపమూ ఎరుగమంటూ ఎంత మొత్తుకున్నా వారి చెవికి ఎక్కదు.

అనంతరం పోలీసులు వస్తారు. 'అన్నల'తో చేతులు కలుపుతున్నారంటూ నోటికి వచ్చిన బూతులు తిడతారు. బూటు కాళ్ళతో తంతారు. ఇళ్ళలో చొరబడి అందర్నీ చితగ్గొడతారు. స్త్రీలతో అసభ్యంగా ప్రవర్తిస్తారు. పిల్లల్ని, వృద్ధుల్ని సైతం విడిచిపెట్టరు...పోతూ పోతూ చేతికందిన కోడి, పాడి, విప్ప సారా వగైరాలను దొరకబుచ్చుకుని పోతారు. దాచుకున్న డబ్బు, దస్కమూ కైవసం చేసుకుంటారు... ఆ గిరిజనుల బ్రతుకులు అడకత్తెరలో పోకచెక్కల చందం. అటు నక్జలైట్లు, ఇటు పోలీసుల మధ్య వారు నలిగిపోతూంటారు.

ఆ ఎదురు కాల్పుల సంఘటన జరిగిన మూడో రోజు అర్ధరాత్రి...కొండరాయపల్లి గిరిజన తండాలో ప్రవేశించారు సాయుధ వ్యక్తులు ముగ్గురు. వస్తూనే తుపాకులతో గాల్లోకి ప్రేల్చారు, తమ రాకకు చిహ్నంగా. వచ్చింది 'అన్న' లని గ్రహించడంతో భయాందోళనలతో ఒణికిపోయారంతా. గాఢనిద్రలో ఉన్నవారిని బలవంతంగా ఇళ్ళలోంచి బైటకు లాక్కుని వచ్చి రచ్చబండ దగ్గర నిలబెట్టారు 'అన్నలు'. "ఆ రోజు మా దళం ఇక్కడ సమావేశ మవుతుందన్న సమాచారం మీలో పోలీసులకు అందించిం దెవరు?" కర్కశంగా ప్రశ్నించారు.

"సత్తె పెమానంగా మాకేం తెల్వదు, అన్నా! మీ గురించి పోలీసులకు తెలిపే దమ్ము, దయిర్యము ఈ తండాలో ఎవరి కుంటది సెప్పు" అన్నాడు తండాకి నాయకుడైన ముఖియా. అరవయ్యేళ్ళుంటాయి అతనికి.

"నోర్ముయ్ రా, ముసలోడా! పోలీసోళ్ళిచ్చే కాసులకు కక్కుర్తిపడి మమ్మల్నే పట్టిస్తారట్రా మీరు?" గర్జించారు. "నిజం చెప్పకపోతే, తండాకి నిప్పు పెడతాం, జాగ్రత్త!"

"నిజమే సెబుతున్నా, అన్నా! మీ కూటమి సంగతి మాకెలా ఎరికవుద్ది? జరా ఆలోచించన్నా!" నమ్మించడానికి ప్రయత్నించాడు ముఖియా.

"మీ బతుకులు బాగుచేయడం కోసమని మేం ప్రాణాలొడ్డి పోరాడుతూంటే...మాకే ద్రోహం చేస్తారట్రా మీరు?" ఉరిమారు వాళ్ళు.

ఆ మాటలతో ఓ గిరిజన యువకుడిలో ఆవేశం పొంగింది. "ఏందన్నా, మీరు మా బాగు కోసం పాటుపడేది? తోచినప్పుడల్లా తండాలపైన పడి దోచుకోవడమేనా? మమ్మల్ని బెదిరించి మీ పనులు చేయించుకునేదేనా?" అన్నాడు విసురుగా.

ఆ యువకుణ్ణి వారించబోయాడు ముఖియా. కాని, ఉడుకు రక్తం ఊరుకోలేదు. "నువ్వుండు పెద్దయ్యా! మనం అడవి బిడ్డలం. ఈ అడవి మనది. ఈ నేల మనది, ఈ గాలి మనది. మన చోటుకు వచ్చి మన చాటున తల దాచుకునే ఈళ్ళందరి బెదిరింపులకూ లొంగిపోయి భయపడుతూ బతకవలసిన అవసరం మనకు లేదు" అన్నాడు తీవ్రంగా. ముఖియా కంగారుగా ఏదో అనబోయాడు. అంతలోనే ఓ 'అన్న' చేతిలోని తుపాకీ ఆగకుండా గర్జించింది. ఆ యువకుడు నేల కూలాడు.

"మమ్మల్ని ఎదిరించాలని చూసినా, మాకు వ్యతిరేకంగా పనిచేసినా...ఇదే గతి పడుతుంది. ఖబడ్దార్!" అంటూ ఆ గిరిజనుల్ని తీవ్రంగా హెచ్చరించి, క్షణాలలో అక్కణ్ణుంచి అదృశ్యమైపోయారు 'అన్నలు'.

సరసు గట్టున కూర్చుని దీర్ఘాలోచనలో మునిగిపోయింది చండిక. వదనంలో నీలి నీడలు క్రమ్ముకున్నాయి...పదహారేళ్ళ జవ్వని ఆమె. తగిన ఒడ్డూ పొడవూతో...చక్రాలవంటి కాటుక కనులతో...గులాబి రంగుతో... నాజూకుగా ఉంటుంది.

ఆ రోజు ఆమె మనసు కారుమబ్బులు క్రమ్మిన ఆకాశంలా ఉంది. 'అన్నల' చేతిలో అన్యాయంగా హతమైన చంద్రం రూపం ఆమె కనుల ముందు కనిపిస్తోంది. 'ఏం పాపం చేసాడని చంద్రానికి అంత పెద్దశిక్ష!?'

ఆమె మది మూగగా రోదిస్తోంది. ఏడ్చి ఏడ్చి కళ్ళలోని నీళ్ళన్నీ ఇంకిపోవడం వల్ల కాబోలు, కన్నులు తడారిపోయి ఉన్నాయి... అలా ఎంతసేపు ఉండిపోయిందో తెలియదు, ఎవరిదో చల్లటి హస్తం ఒంటి మీద పడడంతో, తేరుకుని తలెత్తి చూసింది.

"ఎన్నాళ్ళిలా బాధపడుతూ కూర్చుంటావు, బిడ్డా! చంద్రం అల్పాయుష్కుడు. అంతే!" అన్నాడు భీముడు - చండిక తండ్రి. అతని పలుకులతో దుఃఖం ఉప్పెనలా పొంగుకువచ్చింది ఆ పిల్లకు. "బాబా!" అంటూ తండ్రిని కావలించుకుని రోదించింది.

ఆ రోజు 'అన్నల్ని' ఎదిరించి మాట్లాడిన నేరానికి వారి బులెట్లకు బలైపోయిన యువకుడి పేరు చంద్రం. చండికను మనువాడనున్నవాడు. రానున్న పున్నమికే వారి పెళ్ళికి లగ్నం నిశ్చయింపబడింది.

అంతలోనే ఆ దారుణం జరిగిపోయింది...

బాబా!" హఠాత్తుగా తలెత్తి తండ్రి కళ్ళలోకి సూటిగా చూస్తూ అంది చండిక - "మనం ఈ ప్రకృతికి పుట్టినవాళ్ళం. అడవి తల్లికి ముద్దు బిడ్డలం. ఒరుల జోలికి పోకుండా, పరుల కష్టాన్ని కైవసం చేసుకోకుండా మన బతుకులు మనం బతుకుతున్నాం. అడవిలో దొరికిందేదో తింటూ, లేని నాడు పస్తులుంటూ హాయిగా జీవిస్తున్నాం. మన తిండి మనం కష్టపడి సంపాదించుకుంటూ సామాన్య జీవితం గడపుతున్నాం. మనం

ఎవర్నీ అడుక్కోవడం లేదు, ఎవర్నీ మోసగించడం లేదు. బడా బాబుల్లా ఈ వన్య సంపదను దోచుకోవడం లేదు. ఈ చెట్లు, ఈ పక్షులు, ఈ నేల, ఈ నీరు, ఈ గాలి నేస్తాలుగా సహజీవనం చేస్తున్నాం... అటువంటి మనం ఎవరి తూటాలకో బలి కావలసిన అగత్యం ఏమిటి? ఆదుకుంటామంటూ అన్నలూ, కాపాడతామంటూ పోలీసులూ మన జీవితాలతో ఆడుకుంటూంటే...చూస్తూ ఊరుకోవలసిందేనా? మనం ఏమీ చేయలేమా? మన బ్రతుకులు మనవి కావా??..."

కూతురి మదిలో పరవళ్ళు త్రొక్కుతూన్న ఆవేదన, పొంగి పొరలుతూన్న ఆవేశం భీముడికి అర్థమయ్యాయి. ఆమె వంక జాలిగా చూసాడు. అనునయంగా తల నిమురుతూ, "జీవితమే ఓ సమరం, బిడ్డా! ఇదీ అందులో ఓ భాగమే ననుకోవాలి. సిద్ధాంతాల పేరుతో రెండు శక్తులు రాద్ధాంతానికి తలపడితే, మధ్యలో సామాన్యుడు నలిగిపోక తప్పదమ్మా".

"అంటే? అన్యాయాన్ని ఎదుర్కొనే గుండె ధైర్యం మన జాతికి లేదంటావా, బాబా? మౌనంగా బలిపశువులం కావలసిందేనా?" ఉద్వేగంతో ప్రశ్నించింది.

కూతురి ప్రశ్నకు సమాధానం భీముడి దగ్గర లేదు. విషయాన్ని దాటవేయడానికి యత్నిస్తూ, "బిడ్డా! చంద్రం చావుకి తండా అంతా కన్నీరు మున్నీరయింది. పోయినవాడితో మనమూ పోలేం కదా! జరిగింది మరచిపోయి జీవితంలో ముందుకు జరగక తప్పదు" అంటూ ప్రేమగా ఆమె తల నిమిరాడు.

విశాఖ ఏజెన్సీలోని దళాలలో బ్రహ్మన్న దళం ముఖ్యమైనది. అందులో కేడర్లుగా పనిచేస్తూన్న వెంకటేశం, రాజయ్యలు ఇద్దరే తెలుగువారు... పశ్చిమ గోదావరి జిల్లాలోని పోలవరానికి చెందిన వెంకటేశం ఆ ఉద్యమంలోకి వచ్చి ఏడాది పైనే ఐంది.... వరంగల్ కి చెందిన రాజయ్య డిగ్రీ పాసయ్యాడు. చదివిన చదువు ఉద్యోగం కాని, ఉపాధి కాని కల్పించకపోవడంతో ప్రభుత్వం పైన,

సమాజం పైన అలిగి ఆర్నెల్ల క్రితం 'అన్నలలో' కలిసిపోయాడు...

మొదట్లో వీరోచితంగా అనిపించిన ఆ జీవితం రాను రాను దుర్భరంగా తోచింది రాజయ్యకు. దళంలోని సీనియర్లు కేడర్లను తమ స్వంత నౌకర్లుగా చూడడం కద్దు. దుస్తులు ఉతికించుకోవడం, షూస్ కి పాలిష్ చేయించుకోవడం, కాళ్ళు పిసికించుకోవడం, ఒళ్ళంతా మసాజ్ చేయించుకోవడం, వగైరాలు చేసేవారు. డిగ్రీ చదివిన రాజయ్యకు అది మ్రింగుడు పడేది కాదు. పైగా దళాలలో ప్రాంతీయ, కుల తత్వాలకు కొదవ లేదు. నాయకులంతా అగ్రకులాలకు చెందినవారేనని మిగతావారికి గుర్రుగా ఉంటే, తక్కిన కులాలవారిని వారు అణచియుంచుతున్నారన్న వాస్తవం రాజయ్య దృష్టిని దాటిపోలేదు.

ఆ ఉద్యమంలోంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్న రాజయ్య, "అణచివేతకు గురౌతున్న బడుగు వర్గాల కేదో మంచి చేయాలనన ఆశయంతో ఇందులో చేరానుకాని, అడ్డమైన వాడికీ కాళ్ళు పిసకడానికి కాదు. నేను వెళ్ళిపోవాలనుకుంటున్నాను" అన్నాడు వెంకటేశంతో.

"మంచో చెడో, మనం ఎంచుకున్న మార్గం ముళ్ళ దారి. అందులో అడుగిడడమనేది పులి నోట్లో తల పెట్టడం వంటిదే. ఒకసారి లోపలికి వచ్చాక బైటకు పోవడమంటూ ఉండదు" అన్నాడు వెంకటేశం.

"ఏమైనా కానీ, పోలీసులకు లొంగిపోతాను నేను" అన్నాడు రాజయ్య దృఢ నిశ్చయానికి వచ్చినవాడిలా. "తొందరపాటుతో ఆపద కొనితెచ్చుకోకు," అంటూ హెచ్చరించాడు వెంకటేశం.

ఆ సంభాషణ జరిగిన వారం రోజులకే సీనియర్ ఒకడు రాజయ్యను పిలచి తన కాళ్ళు పిసకమని ఆదేశించాడు. రాజయ్య నిరాకరించాడు. అది ఇరువురి మధ్యా ఘర్షణకు దారి తీసింది. ఫలితంగా ఆ వ్యక్తి రాజయ్యను తుపాకితో కాల్చి చంపేసాడు.

ఆనక ఆ సంగతి తెలిసి నిర్ఘాంతపోయిన వెంకటేశం, దళనాయకుడికి ఫిర్యాదు చేస్తే, "మీ తెలుగోడు చచ్చాడని బాధగా ఉన్నట్టుంది నీకు. మరో తెలుగోణ్ణి కొత్తగా రిక్రూట్ చేద్దాంలే" అన్నాడు అతను నిర్లక్ష్యంగా.

అతని తీరు వెంకటేశం గుండెల్ని మండించింది.

ఆంధ్రా పోలీసుల ధాటికి తట్టుకోలేక నిర్వీర్యమౌతూన్న విశాఖ ఏజెన్సీ దళాలను సమాయత్తపరచి ప్రభావితం చేసేందుకు ఏరియా కమాండర్ బెనర్జీ అక్కడకు వస్తున్నాడు. బస్తర్ అడవులలో ఉంటాడు అతను.

బెనర్జీ పశ్చిమ బెంగాల్ లోని మిడ్నపూర్ జిల్లాకి చెందినవాడు. ముప్పయ్యేళ్ళుగా ఆ ఉద్యమంలో ఉంటూ సాధారణ కేడర్ నుండి ఆ స్థాయికి ఎదిగాడు. అతి క్రూరుడు. ఎన్నో హత్యలు.. బాంబు దాడులు...

కిడ్నాపులు...ప్రభుత్వ కార్యాలయాలు, రైల్వే స్టేషన్లు, పోలీస్ స్టేషన్లు ప్రేల్చేయడం వగైరా తీవ్రమైన నేరాల కేసులెన్నో అతని పైన ఉన్నాయి. ప్రభుత్వం అతని తలపైన పాతిక లక్షల బహుమతిని కూడా ప్రకటించింది.

బెనర్జీ రాక సందర్భంగా రహస్య సమావేశం ఏర్పాటుచేయబడింది....ఆ విషయం తెలుసుకున్న వెంకటేశంకి, తన మిత్రుడు రాజయ్య హత్యకు ప్రతీకారం తీర్చుకునే అదను అదే ననిపించింది. ఆ సమావేశం గురించి పోలీసులకు రహస్యంగా సమాచారం అందజేసాడు.

సుమారు ముప్పైమంది నక్సలైట్ ప్రముఖులు సమావేశమై ఉండగా కోబ్రా స్క్వాడ్ హఠాత్తుగా ముట్టడించింది. నక్సలైట్స్ ఎదురుకాల్పులు జరిపారు. ఐదారుగురు నక్సలైట్లు, ఓ సబిన్స్పెక్టరూ ప్రాణాలు కోల్పోయారు. ఇరువైపులా కొందరు గాయపడ్డారు. బెనర్జీ, బ్రహ్మన్నలు తప్పించుకుని సమీపంలోని కొండరాయపల్లి తండాలో చొరబడ్డారు. వారిని తరుముతూ వచ్చిన పోలీసులు తండాని చుట్టుముట్టారు. పోలీసుల ఫ్లడ్ లైట్స్ తో ఆ ప్రాంతమంతా పట్టపగలు ఐంది. బెనర్జీ, బ్రహ్మన్నలను లొంగిపోవలసిందిగా మైక్స్ లో హెచ్చరించారు పోలీసులు. జవాబుగా తాము దాక్కున్న ఇళ్ళలోంచి ఎ.కె. 47 లతో కాల్పులు జరిపారు వాళ్ళు. దాంతో ఇరువైపుల నుండీ తుపాకులు ఎడతెరిపి లేకుండా గర్జించాయి.

తండా ప్రజలు భయాందోళనలతో వణికిపోతూ తలుపులు మూసుక్కూర్చున్నారు. బెదిరిపోయిన పిల్లలు ఏడ్పు లంకించుకున్నారు.

"బెనర్జీ! బ్రహ్మన్నా! బలగాలు తండాని దిగ్బంధం చేసాయి. మీరు తప్పించుకుని పారిపోలేరు. ప్రాణాలు దక్కాలంటే మర్యాదగా లొంగిపోండి," మరోసారి హెచ్చరించాడు కోబ్రా కమాండర్. ఇళ్ళలో చొరబడి వారిని లొంగదీసుకోవడం కష్టం కాదు. కాని ఆ క్రాస్ ఫైర్ లో ఆయా కుటుంబీకులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదముంది.

బ్రహ్మన్న మెల్లగా బైటకు వచ్చాడు, ఓ ఆరేళ్ళ పాపను అడ్డు పెట్టుకుని. "ఆఫీసర్! మర్యాదగా నన్ను ఇక్కణ్ణుంచి సేఫ్ గా బైటపడనివ్వండి. అడ్డు వస్తే ఈ పిల్లను షూట్ చేస్తాను" పోలీసుల్ని హెచ్చరించాడు.

భయంతో ఆ పసిపాప ఏడుస్తోంది. పిల్ల తల్లిదండ్రులు హాహాకారాలు చేస్తూ వెనకే వచ్చారు.

కోబ్రా కమాండర్ బ్రహ్మన్నకు నచ్చచెబుతూనే హఠాత్తుగా అతని తలకు గురిపెట్టి రివాల్వర్ తో షూట్ చేసాడు. ఐతే అప్రమత్తంగా ఉన్న బ్రహ్మన్న చటుక్కున పాపను పైకెత్తాడు. బులెట్ తగలడంతో పాప ప్రాణాలు కోల్పోయింది. తల్లిదండ్రులు ఘొల్లుమన్నారు. కమాండర్ ఓ క్షణం నిర్ఘాంతపోయినా వెంటనే తేరుకుని, పారిపోబోతూన్న బ్రహ్మన్న పైన కాల్పులు జరిపాడు. బ్రహ్మన్న కుప్పకూలిపోయాడు.

బెనర్జీ తలదాచుకున్న ఇల్లు భీముడిది. ఆ కుటుంబాన్ని గన్ పాయింట్ లో కదలకుండా చేసాడు. భీముడు, అతని పెళ్ళాం ఆందోళనకు గురైతే, చండిక తమ్ముడు, చెల్లెలు భయంతో ఒణికిపోతూ ఓ మూలను నక్కారు. చండికలో ఆవేశం, ఆగ్రహం రగిలిపోతోంది. బెనర్జీ కిటికీలోంచి ఎ.కె. 47 తో పోలీసుల పైన కాల్పులు జరుపుతున్నాడు. పోలీసుల తూటాలకు ఆ మట్టి ఇల్లు తూట్లు పడుతోంది.

"దయచేసి ఇక్కణ్ణుంచి వెళ్ళిపో, అన్నా! పోలీసులకు, మీకు వైరముంటే అది బైట చూసుకోండి. మమ్మల్ని, మా తండాని నాశనం చేయకండి" చేతులు జోడించి బెనర్జీని అర్థించింది చండిక.

తానెవరో చెప్పుకుని, తనకు సహకరించినంతవరకు వారికేమీ భయం లేదనీ, పోలీసులకు వత్తాసు పలికితే మాత్రం ఆ తండా మొత్తం తగలబెట్టేస్తానని తీవ్రంగా హెచ్చరించాడు బెనర్జీ.

అదే సమయంలో బైటనుండి ఘొల్లుమన్న ఏడ్పు వినరావడంతో, కిటికీ దగ్గరకు పరుగెత్తి బైటకు చూసిన భీముడికి జరిగిన దారుణం ఎరుకైంది. ఆగ్రహం ముంచుకువచ్చింది. తలుపు తెరచి పోలీసులకు బెనర్జీని పట్టించాలని గుమ్మం వైపు పరుగెత్తాడు. అది చూసిన బెనర్జీ, "ఆగు!" అంటూ అరచాడు. భీముడు ఆగలేదు. తలుపు గొళ్ళెం తీయబోయాడు.

బెనర్జీ చేతిలోని తుపాకి భయంకరంగా గర్జించింది. భీముడు నిర్జీవంగా నేలకూలాడు.

కొయ్యబారిపోయారంతా. చండిక, అపర చండికే ఐంది. ఆగ్రహం, ఆవేశం ఆమెను పెనవేసుకున్నాయి. చేతి కందిన కత్తిపీట తీసుకుని ఆడపులిలా బెనర్జీ పైకి లంఘించింది. ఏం జరుగుతోందో గ్రహించే లోపునే అతని చేతిలోని తుపాకీని ఎగురగొట్టింది. కత్తిపీటకున్న పదునైన కత్తితో అతని కడుపులో పొడిచింది. ఊహించని ఆ దాడిని తట్టుకోవడం కష్టమైంది బెనర్జీకి. అతను తేరుకునే లోపునే కత్తిని అతని గుండెల్లో బలంగా దించింది ఆమె. శక్తి ఏదో ఆవహించినట్టు ఊగిపోతూన్న ఆ పిల్ల బలం ముందు అతని పెనగులాట పనిచేయలేదు.

"ఒరేయ్! ఇంకా ఎందరు అమాయకుల్ని బలి తీసుకుంటార్రా మీరు? మీకు మేము ఏం అన్యాయం చేసామనిరా?" మిగతావాళ్ళు దిగ్భ్రాంతితో అవాక్కై చూస్తూంటే, అరుస్తూ కత్తిపీటతో బెనర్జీ శరీరాన్ని చీల్చి చెండాడింది చండిక. బెనర్జీ రక్తపు ముద్దలా కుప్పకూలిపోయాడు.

చండిక తల్లి తలుపు తెరవడంతో పోలీసులు బిలబిలమంటూ లోపలికి పరుగెత్తుకొచ్చారు. అప్పటికే ప్రాణాలు కోల్పోయిన బెనర్జీని, చేతిలో కత్తిపీటతో ఒళ్ళంతా రక్తంతో భద్రకాళిలా నిల్చున్న చండికనూ చూసి విభ్రాంతికి గురయ్యారు.

"ఎన్నో ఏళ్ళుగా తప్పించుకు తిరుగుతూన్న ఈ మృగాన్ని చంపి సమాజానికి మేలు చేసావు నువ్వు. నీ ధైర్యసాహసాలకు జోహార్లు!" అన్నాడు కోబ్రా కమాండర్.

"వీడి తలమీద పాతిక లక్షల బహుమతి ఉంది. ఆ సొమ్ము నీకే దక్కేలా ప్రభుత్వానికి సిఫారసు చేస్తాను".

జవాబుగా కత్తిపీట క్రింద పడేసి చేతులు జోడించింది చండిక. "మాకు లక్షలూ వద్దు, కక్షలూ వద్దు దొరా! అటు అన్నలతోను, ఇటు పోలీసోళ్ళతోను విసిగి వేసారిపోయాం మేమంతా. దయచేసి మా జోలికి రాకండి మీరెవరూ. అడవి బిడ్డలం మేం. అమాయక జీవులం. ఈ అడవిలో స్వేచ్ఛగా, ప్రశాంతంగా మా బతుకులు మమ్మల్ని బతకనివ్వండి" అంది మానసిక, శారీరక అలసటతో నేలపైన చతికిలబడుతూ.

ఎంతో ఎత్తులో కనిపిస్తూన్న ఆ టీనేజ్ పిల్ల వంక అయోమయంగా నోరు తెరచుకుని చూసాడు కమాండర్.




ఎంతైనా మగాడు మగాడేగా!

ఎంత ప్రేమించిన దాన్నైనా ఒక మెట్టు కిందికి తొొక్కేయడం మామూలేగా!

కొత్తేం కాదు...యుగ యుగాలుగా జరుగుతున్నదిదే!

ప్రేమించేదాకా తియ్యటి కబుర్లెన్నో ... అసలు జీవితాన్నే పాదాక్రాంతం చేసేసేట్లు ...తీరా పెళ్ళయాకేగా అసలు రూపం బయటపడేది. ప్రియురాలుగా ఉన్నంతవరకూ ఆకాశమే హద్దు. పెళ్ళామయితే ఎన్నో హద్దులు... మరెన్నో ఆంక్షలు.

అవును. మహర్షి కూడా ఒక మగాడేగా!

కాకపోతే ...ఏమన్నాడూ... ఉదయం?

అతను పూర్తిగా మారిపోయాడు. పెళ్ళయినప్పట్నుంచీ... నాకు ప్రమోషన్ వచ్చినప్పట్నుంచి మరీనూ...

అంటే మహర్షి నా ఎదుగుదల భరించలేకపోతున్నాడా?

"శశీ! నీ కళ్ళలోకి చూస్తూ ఇలానే ఉండిపోవాలనుంది ఎన్ని యుగాలయినా..." అన్నప్పుడు ఎంత మురిసిపోయాను.

నా అపాయింట్ మెంట్ ఆర్డర్ చూసి ఆనందంగా నన్నెత్తుకుని గాల్లో తిప్పేసినప్పుడు ఎంత ఉబ్బితబ్బిబ్బయ్యాను.

అర్ధరాత్రి దాకా ప్రాజెక్ట్ వర్క్ చేసుకుంటుంటే పక్కన కూర్చుని ఎన్ని కబుర్లు చెప్పే వాడు...టీ లు సరఫరా చేసేవాడు నాతో పాటు మేల్కొనే. నిద్ర మత్తులో వాలిపోతున్న నా కనురెప్పలపై సున్నితంగా ముద్దుపెట్టుకొని "ఇక పడుకో శశీ! ఆరోగ్యం దెబ్బతింటుంది" అని ఎంతగా లాలించేవాడు.

నా ప్రమోషన్ కు పరోక్షంగా ఎంత సాయపడ్డాడు.

ప్రమోషన్ వచ్చిన రోజు స్వీట్లు పంచి నా కంటే ఎక్కువగా ఆనందించినవాడు -

అయితే ... ఇప్పుడేమయింది?

ఇప్పుడాలోచిస్తే - అవును అదంతా అతనిలోని ఒక పార్స్వం మాత్రమే.

మరో పార్స్వం  ఇపుడిపుడే అర్ధమవుతోంది.  మగవాడి అసలు రంగు బయట పడుతోంది.

ప్రిగ్నెన్సీ కంఫర్మయినట్లు చెప్పి చెప్పగానే - ఎత్తుకొని గిరగిరా తిప్పేసి ఎంత ముద్దుల వర్షం కురిపించాడని -

ఎంత సంబరపడ్డాడనీ-

మాటలకందని ఆనందంతో  ఆ కళ్ళల్లోని మెరుపు చూసి ఎంత తబ్బిబ్బయ్యాననీ -

ఎన్ని జాగ్రత్తలు చెప్పాడనీ -

అలా చెపుతూనే - మెల్లగా - మెత్తగా

చావు కబురు ... అవును నిజంగానే చావు కబురు లాంటిదే -

కాకపోతే...?

"శశీ! ఇక మీదట ఇంటిపన్లన్నీ మానేసి ... ఉద్యోగం  కూడా మానేసి ...హాయిగా రెస్ట్ తీసుకో"

"ఏమంటున్నావు? మహర్షీ! ఉద్యోగం మానేయలా...?" ఉలిక్కిపడి అశ్చర్యంగా అడిగాను.

“అదికాదు ...శశీ!"

" ఆర్నెలలు మెటర్నిటి లీవుంది.  నాకు మరో మూడు నెలలు లీవులున్నాయి. అవసరమయితే వాటిని వాడుకుందాం.

అంత మాత్రానికి ఉద్యోగం మానేయడం దేనికి?"

"శశి! మనకు కావలసినంత ఉంది. నువ్వు ఉద్యోగం చేసి సంపాదించాల్సిన అవసరం లేదు. హాయిగా రెస్ట్ తీసుకుని పండంటి బిడ్డను కను. వాడితో నీకు బోలెడంత కాలక్షేపం ..."

"ఉద్యోగంలో నాకు మంచి కాలక్షేపమే జరుగుతోంది. ఒక ఆయాను వుంచుకుంటే వాడి బాగోగులు చూసుకుంటుంది. అయిదారు వేలు పడేస్తే ఆయాలు దొరుకుతారు. దాని కోసం బంగారం లాంటి ఉద్యోగాన్ని వదులుకోవడం నాకు ఇష్టం లేదు."

"మన బిడ్డను ఎవరి చేతుల్లోనో పెడ్తే; వాళ్ళు సరిగ్గా చూసుకుంటారో ...లేదో; మనమయితే జాగ్రత్తగా చూసుకోవచ్చు. వాడి ఎదుగుదలను కళ్ళారా చూసి ముచ్చట పడొచ్చు. ఆనందించొచ్చు. ఆ అనుభవాన్ని పదిలంగా పది కాలాల పాటు దాచుకోవచ్చు."

" నీవెన్నైనా చెప్పు..

.""నాకు తెలిసిన వారబ్బాయి ...."

"ఆపుతావా? మహర్షీ! నీవు కూడా ఒక సగటు మగాడిగా ఆలోచిస్తున్నావు. నీ భార్య ఎదుగుదల సహించలేక పోతున్నావు. అంతేనా నీ సంస్కారం?" నాలో ఆవేశం కట్టలు త్రెంచుకుంది.

"అంతేనా! నన్నర్థం చేసుకుంది. శశి!" దెబ్బతిన్న పులిలా చూశాడు. ఏమనుకున్నాడో ఏమో విసురుగా బయటికెళ్ళిపోయాడు.

అయినా - "ఏమాలోచించావు శశి!" అని అప్పుడప్పుడు గుర్తు చేస్తూనే వున్నాడు.

మహర్షి! నువ్వేం వర్రీ కాకు. అంతా నేను చూసుకుంటాను." అని చెప్తూనే వున్నాను.

అయినా మహర్షి మాటి మాటికీ అలా అడగడం నాకు నచ్చడం లేదు. అతనిలోని పురుషాధిఖ్యతను నేను జీర్ణించుకోలేక పోతున్నాను. ఈ ఉదయం పెద్ద గొడవే జరిగింది. మాటా మాటా పెరిగి నేను గట్టిగానే సమాధానం చెప్పాను.

"ఇంకోసారి ఇలా మాట్లాడితే నేను అబార్షన్ చేయించుకుంటాను." అని బెదిరించాను.

బిత్తరపోయాడు మహర్షి.

"అలాగే శశీ! నీ ఇష్టం. ఇకమీదట నేనేమీ మాట్లాడను. నీకెలా తోస్తే అలాగే చెయి." మారు మాట్లడకుండా ఆఫీస్ కెళ్ళిపోయాడు.

మహర్షి ఎందుకింత పట్టుబడుతున్నాడో నాకర్థం కావడం లేదు. మాది లవ్ మ్యారేజి. పట్టింపులతో పెద్దలను ఎదిరించి పెళ్ళి చేసుకున్నాం. ఇప్పుడిప్పుడే వారి వాళ్ళు కొద్ది మెత్తబడ్డా; మా వాళ్ళు ఇంకా గుర్రుగానే ఉన్నారు. అయినా ఆలోటే నాకు తెలియకుండా చాలా చాలా అపురూపంగా చూసుకుంటున్నాడు. పెళ్ళైన ఈ మూడేళ్ళలో ఏనాడూ నా మాటకు ఎదురు చెప్పలేదు. కానీ - ఈ విషయంలో మాత్రం ఎందుకింత పట్టుబడుతున్నాడో అర్థం కావడం లేదు.

"ఏమిటే! అలా ఉన్నావు?" నా క్లోజ్ కొలీగ్ విమల అడిగింది.

చూచాయగా ఈ విషయం చెప్పి సలహా అడిగాను.

'దాన్నే మగబుద్ధి అంటారే? ఏ మగాడూ పెళ్ళాం తనకంటే ఎదిగిపోవడం సహించలేడు. ప్రతి మగాడు అంతే. ఇంటింటి కథే ఇది." అంది విమల తేలిగ్గా.

అంటే మహర్షి కూడా ఆ "ప్రతి" మగాడిలాగే ఆలోచిస్తున్నాడా? ఇంత వరకు మహర్షి "ప్రత్యేకం" అనుకున్నాను. అతను కూడా మామూలు మగాడు అనుకోవడానికి నాకెందుకో మనస్కరించడం లేదు. మనస్సంతా అదోలా ఉంది. నేను ప్రత్యేకం అనుకున్న

మహర్షి “ సాధారణ మగాడు “ అనుకోవడానికి నా మనసొప్పుకోవడం లేదు.

ఆలోచిస్తూనే బస్ స్టాప్ చేరాను.

"ఏమిటే శశి! ఎంత పిల్చినా పలుకవూ?" అంటూ నా భుజం పై చేయి పడేసరికి స్పృహలోకి వచ్చాను.

ఎదురుగా నా బెస్ట్ ఫ్రెండ్ శోభ.

తేరుకొని "ఏమిటే! ఇక్కడా...ఇంత సడెన్ గా!" అన్నాను.

"మా అక్క కొడుకు వుండేది ఇక్కడే."

"అవునా?" ఆశ్చర్యంగా అడిగాను. శోభను చూడగానే అనందంగా ఉంది. ఉదయం నుంచి వున్న బాధంతా పోయినట్లయి మనసంతా హుషారుగా ఉంది.

'పద ఇంటికి పోదాం" అన్నాను.

"లేదే. ఇప్పుడు అర్జెంట్ గా వాణ్ణి చూడాలి." అంది విషాదంగా.

"నువ్వూ రా! చూసొద్దాం?" అంటూ ఆటోను కేకేసింది.

ఆటో " రిహబిలిటేషన్ హౌజ్ఫ ర్ మెంటలీ రిటార్డెడ్ " ముందాగింది.

దిగి వడివడిగా లోనికెళ్ళింది శోభ. అయోమయంగా నేనూ అనుసరించాను.

లోన ఎంతో మంది పిల్లలు ఆడుకుంటున్నారు. అందర్నీ దాటుకుంటూ ఒక గదిలోకి అడుగుపెట్టింది.

"ఎలా ఉన్నావు బాబీ" అంటూ మంచం పైనున్న అబ్బాయిని పలకరించింది.

ఆ అబ్బాయి ముఖం విప్పారింది శోభను చూడగానే.

"ఆ... ఊ... ఏ..." అని సైగలేవో చేశాడు.

"దా! ఆడుకుందాం.." అని లేవదీసి భుజం పట్టుకుని మెల్లగా నడిపించుకుంటూ వెలుపలకొచ్చింది.

వాడికి పద్దెనిమిదేళ్ళుంటాయి. సరిగ్గా నడవలేకపోతున్నాడు. మాట్లాడలేక పోతున్నాడు.

కాళ్ళు;చేతులు ఒక పట్టానా ఉండడం లేదు. వున్నట్టుండి అరుపులు; పెడబొబ్బలు అంతలోనే ఏడుపులు. మానసికంగా ఎదగని పిల్లాడని నాకర్థమయింది.

చేతికి బంతినిచ్చి మెల్ల మెల్లగా ఆడిస్తోంది. పక్కన పిల్లల్ని చూసి వాడు ఆడుతున్నాడు. అక్కడున్న పిల్లలంతా మానసికంగా ఎదగని పిల్లలే. వివిధ వయస్సుల్లో వున్న పిల్లల్ని వారి వారి తల్లో; తండ్రో; బంధువులో ఆడిస్తున్నారు. నా కంతా వింత వింతగా వుంది. మరో ప్రపంచంలో ఎక్కడో అడుగు పెట్టినట్లుంది. ఆడిస్తున్న కొందరి తల్లి;తండ్రుల కళ్ళల్లో ఇంకిపోతున్న నీళ్ళు నన్ను కదిలించి వేశాయి. వాళ్ళ ముఖాల్లో పెను విషాదం. అంతులేని దిగులు. పదహారు ...పద్దెనిమిదేళ్ళు దాటినా ఇంకా మూడు...నాలుగేళ్ళ పిల్లల్లాగా వాళ్ళ ప్రవర్తన చూస్తుంటే నాకే కన్నీళ్ళాగలేదు. ఇంక వారి తల్లిదండ్రుల గుండె కోత ఎలా ఉంటుందో ఊహించుకోగలను.

ఒకరిద్దరి తల్లిదండ్రులతో మాట్లాడగలిగాను. వారి పిల్లలపైన పూర్తిగా ఆశలు వదులుకున్నట్లుంది. పూర్తిగా నయం కావడం

కష్టమేనట. కానీ ఆశ చావక ఇక్కడ చేర్పించి దేవునిపైన భారం వేసి ట్రీట్ మెంట్ ఇప్పిస్తున్నారట. చిన్నప్పుడు పిల్లల పట్ల తగినంత కేర్ తీసుకోకపోవడం వల్లే ఇలాంటి అనర్థాలు జరుగుతాయట. ఎదిగే వయస్సులో పిల్లల పట్ల తగిన శ్రద్ధ చూపకపోవడమే మూలకారణమని డాక్టర్స్ చెప్పారట. "అంతా అయిపోయాక ఇప్పుడని ఏమి ప్రయోజనం?" అని వాపోయారు. వాళ్ళ కడుపుకోత వర్ణానాతీతం.

"పాపం! చిన్న చిన్న పిల్లలకి ఎంత బాధ వచ్చింది. జీవితాంతం ఇలా బ్రతకడం ఎంత దౌర్భాగ్యం? ఏం పాపం చేశారని వీరికీ శిక్ష? కన్నవారికి ఎంత కడుపు కోత? జీవితాంతం ఎంతటి క్షోభ? ఎంతటి నరకం? పగవారికైనా ఇంతటి శిక్షలొద్దు దేవుడా?" నా ఆలోచనలు పరి పరి విధాలుగా పోతున్నాయి.

ఇంతలో తను తెచ్చిన పళ్ళు; స్వీట్స్ తినిపించి బాబీ ని గదిలో వదిలి వచ్చి నా ప్రక్కన కూర్చుంది శోభ.

"ఏమాలోచిస్తున్నావే?" అంటూ.

"ఈ పిల్లల్ని చూస్తుంటే చాలా బాధేస్తుంది. నాకే ఇంత బాధగా ఉంటే పాపం వాళ్ళని కన్నవాళ్ళు ఎంత నరకం అనుభవిస్తున్నారో?" అన్నాన్నేను.

"అందులో మన స్వయం కృతాపరాధం కూడా ఉంది శశి!"

"స్వయంకృపరాధమా...అంటే?"

"అంటే ... మా అక్క; బావల్నే తీసుకో! "

వాళ్ళకేమయింది?"

"కూర్చుని తిన్నా రెండు మూడు తరాలకి సరిపడా ఆస్థి ఉంది. అయినా ఇంకా ఇంకా సంపాయించాలనే కక్కుర్తి. ధ్యాసంతా

సంపాదన పైన్నే. వాడు పుట్టినప్పుడు కూడా రెస్ట్ లేదు. లీవు లేదు. నెలల బిడ్డను అయా చేతిలో పెట్టి సంపాదన కోసం పరుగో పరుగు. వాడెలా పెరుగుతున్నాడో...ఆయా వాడిని ఎలా చూసుకుంటుందో...సరిగ్గా సమయానికి అన్నీ ఇస్తుందో లేదో ...తెలుసుకునే తీరిక లేదు. వచ్చిన సమయానికి నిద్ర పోతున్నాడా? తమకెలాంటి ఇబ్బంది పెట్టడం లేదు కదా? కావల్సినప్పుడు డబ్బులిస్తే అంతా ఆయా చూసుకుంటుంది. తమకి అంతే చాలు. తాము.. తమ సంపాదన ...కేరిర్; ప్రాజెక్ట్స్; టార్గెట్స్, డెడ్ లైన్స్, అచీవ్ మెంట్స్, ప్రమోషన్స్; ఇంక్రిమెంట్స్ .... జీవితమంతా పరుగో పరుగు. ఒకరికి మించి మరొకరు పరుగు. లేచింది మొదలు అర్ధరాత్రి దాకా పరుగు ఆపకుండా. ఎక్కడ వెనక పడుతామో అని పరుగు. కొంచెం ఊపిరి తీసుకోవడానికి కూడా తీరిక లేని పరుగు. ఆరోగ్యాన్ని కూడా ఫణంగా పెట్టి పరుగు. ఆ పరుగు పందెంలో మనమేం పోగొట్టుకుంటున్నామో ఆలోచించడానికి కూడా తీరిక లేని పరుగు.

నిజమే! సంపాదన పోగేసుకుంటున్నాం. ఫ్లాట్లు, అపార్ట్ మెంట్లు,షేర్లు,బంగారం అన్నీ ... అన్నీ కొనేస్తున్నాం. అవసరానికి మించి సంపాదిస్తున్నాం. నీకిన్ని కోట్లుంటే; నాకిన్ని కోట్లు. నలుగురు కలిసి నప్పుడు కూడా కోట్ల గొప్పలు; ప్రమోషన్ గొప్పలు, జీతం గొప్పలు తప్ప మన నోట్లో మరో మాట రాదు. అంతా అయ్యాక ఒక్క సారి వెనక్కి తిరిగి చూసుకుంటే ... మనమేం సాధించామో నిజాయితీగా బేరీజు వేసుకుంటే తెలుస్తుంది మనమేం పోగొట్టుకున్నామో?

కనీసం చిన్న చిన్న కోరికలు కూడా తనివితీరా తీర్చుకోలేని దౌర్భాగ్యం మనది. పిల్లలతో కలసి గడిపిన క్షణాలు; కలిసి భోంచేసిన క్షణాలు; చేయి పట్టి నడిపించిన క్షణాలు; కథలు చెప్పిన క్షణాలు; వారికి ఆసరాగా నిలిచిన క్షణాలు; వారికి భరోసా ఇచ్చిన క్షణాలు గుర్తుకు రావు. అసలుంటేగా గుర్తుకు రావడానికి. డబ్బుకు కొదవలేకుండా పెంచాం. అడిగింది అడిగినట్లు కొనడానికి డబ్బులిచ్చాం. చూసుకోవడానికి ఆయాను పెట్టాం. . . తల్లిదండ్రులుగా ఇంకేం చేయాలి? ఇదీ మన వరస. గొప్పగా పెంచామనీ; కాస్ట్ లీ చదువులు చెప్పించామనీ గొప్పలు." ఆవేశంతో చెప్పుకుపోతోంది శోభ.

“మా అక్కా;బావలు కూడా ఈ పరుగు పందెంలో బ్యాంక్ బ్యాలన్స్ పెరగడం; ఆస్తులు పెరగడం, జీతాలు పెరగడం; ఉద్యోగాల్లో హోదాలు పెరగడం చూసుకున్నారే తప్ప పిల్లాడు ఎలా పెరుగుతున్నాడో చూసుకోలేకపోయారు. కొదువలేకుండా డబ్బులిచ్చినా ఆయా వాణ్ణి సరిగ్గా చూసుకోలేదు. వీళ్ళు ఇలా ఆఫీస్ కు పోతూనే పసివాడని కూడా చూడకుండా మంచం కోడుకు వాడి కాళ్ళు కట్టేసి ఆడుకోవడానికి వాడి ముందు బొమ్మలు నాలుగు పడేసి; ఆమె తన సంపాదన కోసం అలా పనికెళ్ళేది. ఎప్పుడో తీరిక దొరికినప్పుడు వచ్చి వాడిని చూసుకొనేది. సాయంత్రానికి వీరు తిరిగి వచ్చేసరికి అంతా సవ్యంగా వుండేది. సంపాదన ధ్యాసలో దానికీ నాటకాలాడాడం వచ్చేసింది. చీకటి గదిలో ఒంటరిగా ఆ నోరులేని చిన్నారి బాధ ఎవరికీ పట్టలేదు. చివరికి మెదడు ఎదగక ఇలా దైన్య స్థితిలోకి నెట్టబడ్డాడు. మేలుకునే లోపే జరగాల్సిన ఘోరం జరిగిపోయింది. ఇప్పుడు మా అక్కా;బావలకు కోట్లున్నాయి. కాని అనుభవించాల్సిన వారసుడు ఇలా ఉన్నాడు. మా అక్క కుమిలిపోతోంది. తనను తాను తిట్టుకోని క్షణం లేదు. కానీ ఏం లాభం? తప్పును సరిదిద్దుకోవడానికి గడిచిన కాలం తిరిగి రాదుగా! అన్యాయంగా పసివాడు బలయి పోయాడు. " వెక్కి వెక్కి ఏడుస్తోంది శోభ.

"సంపద కన్నా మంచి పౌరుణ్ణి సమాజానికి అందించాల్సిన బాధ్యత ప్రతి తల్లికి ఉంది. మన మెంతైనా సంపాదించొచ్చు. సంపదనెంతైనా కూడ బెట్టొచ్చు. కాని ఆ యావలో పిల్లల్ని; వారి బాల్యాన్ని బలి చేయడం బావ్యం కాదు. ఆరోగ్యవంతమయిన ఉత్తమ పౌరుడే నవ సమాజానికి అవసరం. కరెన్సీ సంపద కన్నా ఆరోగ్యమయిన మానవ సంపదను ముందు తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి తల్లికి ఉంది. వారే నిజమైన దేశ సంపద. " ఆవేశంతో వూగిపోతోంది శోభ.

ఆమె చెబ్తున్న ఒక్కొక్క మాట ఒక్కొక్క తూటాగా మారి నా అజ్ఞాన తిమిర పొరల్ని చేదిస్తూ కర్తవ్య బోధ చేస్తున్నాయి. నా కళ్ళు అప్రయత్నంగా వర్షించడం మొదలెట్టాయి.

అవును. ఇద్దరూ రెక్కలు ముక్కలు చేసుకొని ఎవరికోసం సంపాదిస్తాం? ఆ పిల్లలే ఆరోగ్యంగా లేనప్పుడు ఈ పోగే సిన లక్షలు లక్షలు ఎవరి కోసం?

మహర్షి గుర్తుకొచ్చాడు. నా మూర్ఖత్వంతో అతనేం చెప్తున్నాడో కూడా వినిపించుకోలేదు. నా పిడివాదం నాది. "ఆధిఖ్యత" అని నోరు మూయించేశాను.

"బార్యాభర్తలు సంసారంలో కుటుంబపరమయిన విషయాలు తమకు అనుకూలంగా సౌఖర్యంగా తీసుకోవాలేకానీ; ప్రక్కవాడితో పోటీ పడరాదు. వాళ్ళు ఉద్యోగం చేస్తున్నారని; మనమూ చేయాలనుకోవడం...వారు కొంటున్నారని; మనమూ కొనేయడం...వాళ్ళు చేస్తున్నారని; మనమూ చేసేయడం...వారు పరుగెత్తుతున్నారని; మనమూ పరుగెత్తడం పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లవుద్ది. మన అవసరానికి; మన కుటుంబపరంగా ఏది మంచిదో ...ఏది మనకనుకూలమో బార్యాభర్తలు కాసేపు "ఇగో"లు ప్రక్కన పెట్టి కూర్చుని నిర్ణయాలు తీసుకుంటే ఇల్లే స్వర్గమవుతుంది. ఏ రెండు కుటుంబాల పరిస్థితులు ఒకేలా ఉండవు. అలాగే పరిష్కారాలు ఒకేలా ఉండవు. ఎవరికి వారే తమ కుటుంబపరంగా నిర్ణయాలు తీసుకోవడం ఉత్తమం "- ఎంత గొప్పగా చెప్పింది.

ఇంటికెలా వచ్చానో తెలియదు. "ఏమయింది శశీ!" కంగారు పడ్తున్న మహర్షి గుండెలపై వాలి వెక్కి వెక్కి ఏడ్చాను తనివి తీరా.

కుదుటపడ్డ తర్వాత రిజిగ్నేషన్ లెటర్ రాసి సైన్ చేసి "ఇది మా ఆఫీస్ లో ఇచ్చేయండి" అన్నాను నిశ్చలంగా అయోమయంగా చూస్తున్న మహర్షి కేసి చూస్తూ. *




"ఏంట్రా ఈ సారి కూడా ఉద్యోగం రాలేదా?" ఇంటికొచ్చిన కొడుకుని గుమ్మం దగ్గరే అడిగేసాడు రవీంద్ర.

లేదు అన్నట్లుగా తల ఊపి ఇంట్లోకి మెల్లిగా అడుగుపెట్టాడు అశ్విన్.

"ఎందుకురా మనకి ఈ చదువులు అంటే విన్నావు కాదు. నేను చెప్పినట్లు బుద్ధిగా ఇంటి పట్టునుండుంటే బాగుండేది. మీ అమ్మ నిన్ను మరీ గారం చేసేసింది. ఇప్పటికీ మించిపోయింది ఏమీ లేదు. ఇవాళ పేపర్ లో కూడా మాట్రిమొని కాలమ్ లో మంచి సంబంధాలు పడ్డాయి. ఒక రెండు రోజులు టైం తీసుకొని, నచ్చినవి ఏంటో మాకు చెప్పు" అని రవీంద్ర కొడుకుతో చెప్పేసి, వంటింటిలోకి వెళ్లిపోయాడు.

అశ్విన్ తనకి తగ్గ మాచస్ పెన్నులో మార్కు చేస్తూండగా తన తల్లి ఇంటికి రావటం చూసి దగ్గరికెళ్ళాడు.

“అమ్మా, ఇవాళ ఇంటర్వ్యూ ఈజీ గానే ఉంది. కాని ఆ కంపెనీ లో ఎక్కువ ఆడవారే ఉంటారుట. ముక్కోపులు అసలే. నేను ఒక చిన్న తప్పు చేసినా కూడా నాకు ‘దృశ్యం ’ చూపించేస్తారు. అందుకే భయం వేసింది, జాబ్ వదిలేసుకున్నాను” అని అశ్విన్ ఎంతో బాధతో అమ్మతో చెప్పాడు.

“తప్పదురా. ఎంత కూతుళ్ళలా పెంచినా కూడా తరతరాలుగా నీ లాంటి యువకుల మనస్సులో కలుగుతున్న భయాన్ని పోగొట్టలేకపోతున్నారు చాలా మంది పేరెంట్స్. ఇది 2090. ఒకప్పుడు అంటే 2014 ఆ టైం లో నీ లాంటి అబ్బాయిలను చూస్తే అమ్మాయిలు భయపడి పోయేవారుట. నమ్మశక్యంగా లేదు కదా? నాక్కూడా అలాగే నమ్మబుద్ధి అవ్వడం లేదు. కాని ఇంటర్నెట్ లోనూ, ‘దృశ్యం ’ లోనూ, పాత సినిమాలలోనూ చూపించే సందర్భాలు, సన్నివేశాల బట్టి నమ్మాల్సి వస్తుంది. సరేలే నాకొక గ్లాస్ నీళ్ళు తీస్కొని రా, అలాగే డాడీని గ్రీన్ టీ ఇమ్మను. ఇవాళ మా బాస్ నన్ను వాయించేసింది మీటింగులో…హబ్బా….. తల నొప్పి బాగా” అంటూ తల మీద చెయ్యి పెట్టి, కళ్ళు మూసుకుంది ఛాయ.

ఐదు నిముషాలలో రవీంద్ర టీ, శాండ్విచ్ తీసుకొచ్చి ఛాయ ఎదురుకుండా పెట్టాడు. పాపం ఛాయ నెలంతా కష్టపడి సంపాదిస్తూ, భర్తాపిల్లలతో ఏ లోటు లేకుండా సుఖంగా, సంతోషంగా జీవితం సాగిస్తోంది. రవీంద్రకి భార్య అంటే అమితమయిన ప్రేమ, అంతకంటే ఎక్కువ గౌరవము. మంచి సాంప్రదాయ కుటుంబంలో పుట్టి పెరిగిన రవీంద్రకి, సమాజంలో కూడా మంచి పేరు ఉంది. అందుకే ‘దృశ్యం’ని తన జీవితంలో ఎన్నడూ చూడలేదు, చూడాల్సిన అవసరం రాలేదు. కాని దాని గురించి విన్న దాని ప్రకారం, అది నరకం లో విధించే శిక్షల కంటే దారుణం అట. ఒక్కగానొక్క కొడుకు అయిన అశ్విన్ ఎక్కడ జీవితంలో ‘దృశ్యం’ చూడాల్సి వస్తుందో అని రవీంద్ర భయం. అశ్విన్ కి వచ్చిన ఎన్నో సంబంధాలు కూడా వెనక్కి వెళ్ళిపోయాయి. కారణం ఏదైనా కూడా ఎదిగిన పిల్లాడికి పెళ్లి కుదరట్లేదు అంటే ఏ తండ్రికి అయినా బాధగానే ఉంటుంది మరి. అదే ఆడపిల్ల పుట్టి ఉంటే ఈ పాటికి ఛాయ ఏ బాధ్యతలు లేకుండా ఉద్యోగం మానేసి కాలు మీద కాలు వేసుకొని కూర్చొని, కూతురి సంపాదనని ఎంజాయ్ చేస్తూ ఉండేది. అలాగే కూతురికి పెళ్లి చేసేసి ఉంటే ఒక అల్లుడు కూడా తనకి ఇంటి పనులలో సాయం ఉండేవాడు- ఇలాంటి ఆలోచనల నుండి నెమ్మదిగా బయటపడి రవీంద్ర గట్టిగా నిట్టూర్చాడు.

రెండు రోజులు గడిచాయి. కొడుకు దగ్గరికొచ్చి “ఏరా ఏదైనా మాచ్ నచ్చిందా? అమ్మతో చెప్పి వాళ్ళతో మాట్లాడిద్దామా?” అని రవీంద్ర అడిగాడు.

“ఒకటే ఒకటి నచ్చింది డాడీ. ఆ అమ్మాయి ప్రొఫైల్ ఫేస్ బుక్ లో కూడా చూసాను. అందంగా ఉంది. పెద్ద కంపెనీ లో డైరెక్టర్ పొసిషన్ లో ఉంది. సో తను బ్రాడ్ మైండెడ్ అయ్యుండి, నేను జాబ్ చేసే లిబర్టీ ఉంటుంది అని నా ఫీలింగ్” అని అశ్విన్ చెప్పేసరికి రవీంద్రకి సంతోషమేసింది. ఆ రోజు సాయంకాలమే ఛాయ, ఆ అమ్మాయి తల్లితో మాట్లాడింది. వచ్చే ఆదివారం సాంప్రదాయం ప్రకారం పిల్లాడిని చూడటానికి తమ ఇంటికి వస్తాము అని ఛాయతో చెప్పారు. ఆ రోజు రానే వచ్చింది. ఈ సంబంధం అయినా కుదిరితే బాగుండు అని రవీంద్ర దేవతలని మొక్కుకున్నాడు.

“ముందు పిల్లలకి నచ్చాకే మనం ఇంకేమైనా మాట్లాడుకుందాము. మీరేమంటారు ఛాయ?” పెళ్లి కూతురి తల్లి అన్నారు.

“నాది కూడా అదే అభిప్రాయం. ఎమ్మా శ్రద్ధా, అశ్విన్ .. టెర్రేస్ కి వెళ్లి మాట్లాడుకోండి” అని ఛాయ అనటంతో వాళ్ళిద్దరూ మేడ మీదకి వెళ్లారు.

“సో మీ హాబీస్ ఏంటి?” శ్రద్ధ అడిగింది.

“మా ఇంట్లో నన్ను అమ్మాయిలా పెంచారండి. సో నాకు వంట, కుట్లు, అల్లికలు లాంటి టిపికల్ మగవాళ్ళ ఇంట్రెస్ట్ లు లేవు. ఐ లైక్ ట్రావెలింగ్” అని సూటిగా అశ్విన్ చెప్పాడు.

“గుడ్. నాక్కూడా అలాగ ఉండే వాళ్ళే ఇష్టం. కాని పెళ్లి అయ్యాక వంట చేస్తారుగా? హ హ..” అంటూ శ్రద్ధ నవ్వేసింది. అలా కబుర్లు చెప్పుకుంటూ ఒకరిని ఒకరు అర్ధంచేసుకోటానికి ఇద్దరూ ప్రయత్నించారు.

“మీరు నాకు నచ్చారు” శ్రద్ధ డైరెక్ట్ గా చెప్పేసింది.

‘శ్రద్ధ మంచి దానిలాగే ఉంది. పెళ్లి అయ్యాక నాకు ఉద్యోగం చేయాలని ఉంది అని చెప్పడానికి ఇదే కరెక్ట్ టైం’ అని మనసులో అనుకోని గట్టిగా ఊపిరి పీల్చుకొని అశ్విన్ మాట్లాడసాగాడు, “నాకు కూడా మీరు బాగా నచ్చారు. నేను మీకొక ముఖ్యమయిన విషయం చెప్పాలి. నాకు పెళ్లి తరువాత జాబ్ చేయాలని ఉంది. ఇప్పుడు ఉద్యోగ వేటలో ఉన్నాను. ఐ హోప్ తొందరగా జాబ్ దొరుకుతుంది అని.... ”

ఇంకా అశ్విన్ మాటలు పూర్తికాకుండానే “ఏంటి? పెళ్లి అయ్యాక వర్క్ చేస్తావా? మాకు చాలా ఆస్తులున్నాయి. పైగా నేను బానే సంపాదిస్తున్నాను. సో నువ్వు ఉద్యోగం చేయాల్సిన అవసరం లేదు” నిర్మొహమాటంగా శ్రద్ధ చెప్పింది.

“అంటే ఇంత చదువూ చదివి…” అన్న తన మాటలను శ్రద్ధ మధ్యలోనే ఆపేసి “మా ఇంట్లో ఒప్పుకోరు దీనికి. నాకు కూడా

సదభిప్రాయం లేదు. గట్టిగా చెప్పాలంటే యు కనాట్ వర్క్. ఆలోచించుకో " అంది.

"అయితే నాకు ఈ పెళ్లి ఇష్టం లేదండి. కిందకి వెళ్లి చెప్పేద్దాం ఇది కుదరదు అని" అశ్విన్ నిశ్చయంగా అన్నాడు.

"అబ్బో ! సరే, ఆడపిల్లని నాకేంటి భయం? నీకే చెడ్డ పేరు. నీ ఇష్టం ఇంక !" అనుకుంటూ కిందకి వెళ్లి శ్రద్ధ తన పేరెంట్స్ తో "అమ్మా, ఈ పిల్లాడికి పొగరు ఎక్కువలే. బాగా ఫాస్ట్ కూడా. మనకి సరిపోరు వీళ్ళు పదండి" అని బయటకి వెళ్ళిపోయింది శ్రద్ధ. తన వెంటే పిల్ల తల్లిదండ్రులు వెళ్ళిపోయారు.

ఈ హటాత్ పరిమాణానికి ఎలా స్పందించాలో తెలియక ఛాయ సోఫాలో కూలిపోయింది.

"ఛి వెధవ. ఎన్ని సంబంధాలు తీసుకురావాలిరా? మాకెందుకు ఈ శిక్ష? మమ్మల్ని ప్రశాంతంగా బ్రతకనివ్వవా?" రవీంద్ర బాధతో అరిచాడు.

"నేనేం చేశాను డాడీ? నాకు జాబ్ చేయాలని ఉంది అన్నాను. అది వాళ్ళకి ఇష్టం లేదు" అని అశ్విన్ కూడా గట్టిగానే సమాధానం ఇచ్చాడు.

"మాటకి మాట ఎదురు చెప్పటం బాగా నేర్చుకున్నావే? నిన్ను అనవసరంగా కన్నాము మేము" అని రవీంద్ర కోపంగా అన్నాడు.

తను విన్నది నిజమేనా అని సందేహం కలిగి "ఏమన్నారు డాడీ?" అని అశ్విన్ సీరియస్ గా అడిగాడు.

"మాకు కూతురు పుడుతుంది అనుకుంటే నువ్వు పుట్టావురా. ఎన్ని అబద్ధాలు ఆడుంటానో, మగపిల్లాడు పుట్టాడు. దేవుడా అప్పుడే ఏదోకటి చేసుండాల్సింది. నువ్వు మాకు ఎక్స్ట్రా. అదనపు బరువు" రవీంద్ర ఆవేశంతో అన్నాడు.

"నిజమా అమ్మా? మీకు కూతురు కావాలా నువ్వు చెప్పు" అని తల్లి దగ్గరకెళ్ళి దీనంగా అశ్విన్ అడిగాడు.

ఛాయ సమాధానం చెప్పలేదు. అశ్విన్ వైపు కూడా తిరిగి చూడలేదు. ఈ మౌనాన్ని తట్టుకోలేక అశ్విన్ తన రూంలోకి పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయాడు.

ఒక గంట పోయాక అశ్విన్ రూం నుండి ఒక వికృతమైన శబ్దం వినిపించటంతో అటు వైపు రవీంద్ర పరిగెట్టాడు. తలుపు తట్టాడు, అశ్విన్ ని పిలిచాడు, అరిచాడు. తలుపు లోపల నుండి లాక్ చేసి ఉంది, పైగా అశ్విన్ నుండి ఏం సమాధానం లేదు. మెల్లిగా భయం మొదలయింది. ఇంక లాభం లేదు అని తలుపును తెరవటానికి గట్టిగా ప్రయత్నించాడు. పది నిముషాలు కష్టపడితే తలుపు తెరుచుకుంది. లోపల అశ్విన్ ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. అది చూసిన రవీంద్ర కెవ్వ్ అని అరుస్తూ అక్కడే బొమ్మలాగా నిలుచుండిపోయాడు. ఇది గమనించిన ఛాయ, రవీంద్ర దగ్గరకొచ్చి.....

“యావండి యావండీ, లేవండి”

“హే, ఏమైంది?” రవీంద్ర అయోమయంగా అడిగాడు.

“ఏమైంది ఏవిటి నా మొహం. గట్టి గట్టిగా అరుస్తున్నారు నిద్రలో. ఆ వెధవ హారర్ సినిమాలు చూడొద్దు అంటే వినరు. ఏం పీడకల వచ్చిందో ఏమో, చాలా భయంకరంగా అరిచారు మీరు” అని ఛాయ అంది.

“ఇదంతా ఒక కల? అయ్యబాబోయ్!” అని వెంటనే లేచి తన మొబైల్ ఫోన్ తీసి, మర్చిపోయేలోపల కలలో ఏమి జరిగిందో గుర్తున్నంతవరకు రాస్కున్నాడు.

“ఛాయా, నా కల చెప్తాను వింటావా?” రవీంద్ర అడిగాడు.

“నాకొద్దు బాబూ. అసలే వొట్టి మనిషిని కాను. ఇంకొన్ని నెలలలో మీకు మరో అత్తగారు పుడుతుంది” అని ఛాయ నవ్వుతూ అంది.

“దానికి సంబంధించిందే. ప్లీజ్ విను. చాలా వెరైటీ గా వచ్చింది కల” అంటూ తన కొచ్చిన కలని వివరంగా చెప్పాడు.

మొత్తం విన్నాక ఛాయ “కల అదిరింది. నేను ఆఫీసర్, మీరు హౌస్-హస్బెండ్. అదేదో సినిమాలో లాగా మన పాత్రలు తారుమారు అయ్యాయి. పాత్రల పేర్లు కూడా బాగున్నాయి. క్లైమాక్స్ మాత్రం బాలేదు. నాకు చావులు ఇష్టం ఉండవు. సినిమా డైరెక్టర్ కి కథ పంపినపుడు మార్చేద్దాం లెండి” అని టీజ్ చేసింది.

“నీకు జోక్ లా ఉంది కదా?” అని రవీంద్ర సీరియస్ గా అడిగాడు.

“లేకపోతే ఏంటండి? కలలని సీరియస్ గా ఆలోచించకూడదు. మనం సైన్స్ ని నమ్మేవాళ్ళం. ఇంక ఆ విషయం వదిలేయండి” అని అనేసి వెళ్ళిపోయింది.

బిజీ డాక్టర్ అయినా కూడా ఆదివారాలలో రవీంద్ర అవసరముంటేనే హాస్పిటల్ కి వెళ్తాడు. ఆ రోజు ఆదివారం కాబట్టి రోజంతా బాగా లేజీగా గడిచింది. రవీంద్ర లాప్టాప్ ని వదనలే లేదు. నిద్రపోయే ముందు ఛాయ రవీంద్రతో “మీరు ఆలోచించారో లేదో కానీ, మీ కల గురించి నేను బాగా ఆలోచించగా నాకు కొన్ని డౌట్స్ కలిగాయి. అడగనా?”

“హ హ, అడుగు” రవీంద్ర అన్నాడు.

“అసలు మీ కలకి ఏంటి కారణం?”

“నువ్వు ప్రెగ్నంట్ అని తెలిసి మనం డాక్టర్ దగ్గరకెళ్ళినప్పుడు మనం అడగకుండానే ఆవిడ స్కానింగ్ చేసి ఆడపిల్ల అని చెప్పింది. మనం ఎంతో సంతోషించాం. అదే ఉత్సాహంతో హాస్పిటల్ కి మరుసటి రోజు వెళ్ళానా, వెళ్ళగానే విద్య, అదే మెటర్నిటీ స్పెషలిస్ట్, తన రూం నుండి గట్టిగా మాటలు వినిపించాయి. ఆ వైపు వెళ్లి చూస్తే, ఒక బస్సు డ్రైవర్ అట, కూతురు పుట్టబోతోంది అని తెలిసి అబోర్షన్ చేయిన్చుకోమన్నాడు భార్యని. ఆవిడ ససేమిరా అంది. నాకెందుకు ఈ గొడవ అనుకోని నా రూంకి వచ్చేసాను. లంచ్ టైం కి విద్య కలిసినపుడు అడిగాను ఏమైంది అని. ఆ డ్రైవర్ తన భార్యని ఒప్పించేశాడు అబోర్షన్ కి. విద్య చాలా బాధ పడింది. ‘ఫిమేల్ ఇంఫాన్టిసైడ్’ గురించిన ఆర్టికల్స్ చూపించింది. ఇలా ఆడపిల్లలను భూమి మీద పుట్టకుండా ఆపేస్తే ఒక వంద ఏళ్ల తరువాత మొత్తం ప్రపంచ జనాభాలో 25% మాత్రమే ఆడవాళ్లు ఉంటారుట. అప్పటినుండి నేను ఆ విషయం మీద తెగ ఆలోచించాను. అలా అలా నా ఆలోచనలు బహుశా నా కలకి దారి తీసుంటాయి”

“ఎంత దారుణమండి! ఎప్పుడూ పేపర్ లో చదవటమే కాని, ఒక రియల్ లైఫ్ కేసు అనమాట ఇది. ఇలా పుట్టకముందే ఆడపిల్లల

ప్రాణాలు తీసేస్తే మీ కలలో లాగే శాస్తి జరుగుతుంది. అన్నట్లు కలలో 'దృశ్యం ' అని ఏదో అన్నారు, ఏంటది?"

"నాకు ఇప్పుడు చాలా లీలగా గుర్తుంది కల. నా కల ప్రకారం అబ్బాయిలు భవిష్యత్ కాలంలో అంటే 2090 లో బలహీనులుగా ఉంటారు, అదే ఇంగ్లీష్ లో 'ది వీకర్ సెక్షన్' అనమాట. అన్నిటిలోనూ ఆడవాళ్ళ దే రాజ్యం. సింపుల్ గా చెప్పాలంటే సోషల్ గా ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో స్త్రీలు పురుషులుగా, పురుషులుగా స్త్రీలుగా బ్రతకడం. అందుకే నా కలలో రవీంద్ర వంటింట్లో, ఛాయా ఏమో ఆఫీసు నుండి రావడం కనిపించాయి. నాకు గుర్తుండి 2014 వరకు ఆడపిల్లల మీద దాడులు, స్త్రీలకు నచ్చని పనులని వాళ్ళ చేత ఎలా చేయించారు, అసలు స్త్రీలకు సంబంధించిన దురాగతాల వీడియోలు అన్నీ ఒకే సినిమాగా చేసి, ఆ సినిమాని భవిష్యత్ కాలంలో ఉన్న అబ్బాయిలకి చూపించి తప్పు చేస్తే మీకు ఇలాగే జరుగుతుంది, ఇలాంటి శిక్షే పడుతుంది అని భయపెట్టేందుకు ఉపయోగించేవారేమో! ఎమోషనల్ బ్లాక్ మెయిలింగ్. అదీ దృశ్యం సంగతి. నీకు తెలుసు కదా, ఒక మనిషిని ఒక గదిలో ఒంటరిగా ఉంచి, ఒకే వీడియో ని మళ్లీ మళ్లీ చూపించటం ఎంత మెంటల్ టార్చరో. అదే విపరీతమైన 'బ్రెయిన్ స్టార్మింగ్' అన్నమాట. సైకలాజికల్ గా దెబ్బ తింటారు. చిన్న తప్పుకి ఒక్క సిట్టింగ్. పెద్ద తప్పుకి ఎక్కువ సిట్టింగ్లు అంటే రక్తం కక్కుకుని చచ్చేంత ఘోరమైన శిక్ష. శారీరక హింస కన్నా, మానసిక హింస ప్రమాదకరం, బాధాకరం కూడా. అందుకే 'దృశ్యం' అనేది మరణ శిక్ష అంతటిది అన్నట్టుగా అనిపించింది. అయినా కల కదా, ఏమైనా జరగవచ్చు"

"దృశ్యం గురించి తలచుకుంటేనే భయమేస్తోంది. నేను నా కూతురిని లక్షణంగా పెంచుకుంటానండి. మీ ఈ కలని ఇలా వదిలేయకుండా, ఏదోకటి చేయాలండి"

"పోద్దునేమో ఆలోచించకండి అన్నావ్ మరి?"

"ఆడవాళ్ళం ఎన్నో అంటాము. నేను నిజంగా చెప్తున్నాను. ఈ సమాజం పట్ల కొద్దో గొప్పో బాధ్యత ఉన్నవాళ్ళం, పైగా మనం చదువుకున్న వాళ్ళం. చంటి పిల్లలకి ఊపిరి రాకుండా ఆపేవాళ్ళను మాయం చేయాలి"

"నిజమే. ఈ కలని నేను పాజిటివ్ గా తీస్కుంటున్నాను ఛాయా! 'ఆడపిల్లని కాపాడుకుందాం' (Save A Girl Child) ఇలాంటివి ఎన్నో ప్రచార కార్యక్రమాల్లో ఇవాళ అంతా కూర్చొని మన పేర్లను నమోదు చేశాను. ఇంకా చేస్తాను కూడా. మన చేతనైనంత సహాయం మనం చేద్దాము. యు డోంట్ వరీ"

"అసలు మీ కలని, ముఖ్యంగా 'దృశ్యం' గురించి వివరంగా చెప్తే అలాంటి పనులు చేసే మూర్ఖులు కూడా భయపడి మారిపోతారు" అని అంటూండగా, రవీంద్ర తన చెయ్యిని పట్టుకొని, షేక్ హ్యాండ్ ఇచ్చి "హ్యాపి ఉమెన్స్ డే ఛాయా" అన్నాడు.

అప్పుడే డేట్ మారిపోయిందా అని అనుకోని "థాంక్స్ అండ్ సేమ్ టు హర్" అంటూ ఛాయ తన పొట్టవైపు చూపిస్తూ సిగ్గుపడింది.

యత్ర నార్యస్తు పూజ్యంతే, రమంతే తత్ర దేవతాః |

యత్రైతాస్తు నపూజ్యంతే, సర్వాః తత్రాఫలాః క్రియాః ||




రాత్రి పదిన్నరయింది. హుజూర్ నగర్ లో బస్సు దిగాడు వెంకట్రావ్. ఎప్పుడో ఉదయమనగా బయల్దేరితే ఇప్పటికి దిగాడు. అక్కడినుండి ఐదు కిలోమీటర్ల దూరం లో వున్న గూడెం వాళ్ళ సొంతూరు. బతుకుతెరువు కోసం కర్నూలు దగ్గర లోని ఒక కంపెనీలో పనిచేస్తున్నాడు. ఎప్పటికప్పుడు సొంతూరి దగ్గరలో పని వెతుక్కుందామనుకుంటూనే నాలుగేళ్ళనుండి అదే కంపెనీలో ఒక మోస్తారు జీతం తో నెట్టుకొస్తున్నాడు.

ప్రతి రెండేళ్ళకోసారి వాళ్ళ ఊరిలో జరిగే ఎలమంచమ్మ తిరునాళ్ళు జరుగుతుంది. వారం కిందనే భార్యాపిల్లలు కూడ గూడెం

వచ్చారు. నాలుగు రోజులు సెలవు పెట్టి తనూ బయలుదేరాడు. వీటిలో రెండు రోజులు రానుపోను ప్రయాణానికి చెల్లు. అందుకే ఎప్పుడు సొంతూరు వద్దామన్నా నెత్తిమీద కొండంత బరువు పెట్టుకున్నట్లు ఉంటుంది. ఇక్కడి నుండి గూడెం వెళ్ళాలంటే ఆటోలోనో లేదా కాలినడకనో వెళ్ళాలి. అడ్డదారిన పడితే రెండు కిలోమీటర్ల దూరంతగ్గుతుంది. ఆటోలో పోతే బానే వుంటుంది కానీ కనీసం తన ఒకరోజుకు పడే జీతం ఆవిరయినట్టే జేబులో చూసుకున్నాడు. 240 రూపాయలు వున్నాయి. ఆటోలో పోవడానికి మనసొప్పలేదు.

పిల్లలకు డజను అరటిపండ్లను తీసుకున్నాడు. సెల్లుఫోనులో టైం చూసాడు. పదకొండు కావస్తోంది. గట్టిగా ఏదిస్తే అర్ధగంటగూడానికి హుజూర్ నగర్ కి మధ్యలో ఒక పంట కాలువ దాటాలి. ఊరి ముందు తాటి తోపులో నుండి కాలిబాట. సెల్లులో టార్చిలైట్ వుంది. ఒక మాదిరి వెలుతురు వస్తుంది. చార్జింగ్ తక్కువున్నట్టూంది. పర్వాలేదు. అవసరమైనప్పుడు పురుగుపుట్ర జాగ్రత్తలకు ఉపయోగపడుతుంది. చూపు తన చేతులపై పడింది. వేలికి మామగారు పెళ్ళికి పెట్టిన ఎరుపు రాయి ఉంగరం. భార్యకు అదంటే చాలా ఇష్టం.

"పోయిన తిరునాళ్ళకు వచ్చినప్పుడు ఇదే దారిలో రాములు మామను ఇద్దరు దొంగలు పట్టుకుని జేబులో సొమ్ము, ఉంగరం దోచుకోవడమే కాకుండా తమకు గిట్టుబాటు కాలేదని నాలుగు వడ్డించారి కూడా. గుండెలు గుబగుబలాడాయి. తల విదిల్చాను. ఎప్పుడో జరిగిందని ప్రతీసారి జరుగుతుందా" తర్కించుకున్నాడు.

తననెవరైనా గమనిస్తున్నారా అని అటు, ఇటు జాగ్రత్తగా చూసి, పండ్లు కొనగా డబ్బులు మడతపెట్టి లోపల జేబులో పెట్టుకున్నాడు. వేలి ఉంగరం లాగాడు మామగారి వ్యవహారిశైలి లాగానే ఓ పట్టాన మాట వినలేదు. తిప్పలు పడి మొత్తం మీద వేలి నుండి బయటకు లాగాడు. ఓ క్షణం గట్టిగా ఆలోచించాడు. మొలతాడుకున్న పిన్నీసు తీసి దాంతో మోకాలి కింద పాంట్ కింది భాగం లో బట్టకు ఉంగరం గుచ్చి పెట్టాడు. "అమ్మయ్య, దీన్ని ఎవ్వరూ కనిపెట్టలేరు, మహా అయితే డబ్బులు పోతాయి, బంగారం మాత్రం బద్రం, ఈ రోజుల్లో కొనాలంటే వేల రూపాయలు పోయాలి" అనుకుని రెండు కాళ్ళకు పని పురమాయించాడు.

చల్లటి గాలి వీస్తుంది. పంటకాలువ ఒడ్డమ్మటి సమాధులు తెల్లగా కనబడుతున్నాయి. అదిరే గుండెలు చిక్కబట్టుకొని అడుగులేయసాగాడు. భయం తగ్గడానికి సినిమా హీరోయిన్ లను, ఇంకా తన కుర్ర వయసులో విన్న, చూసిన , చేసిన రకరకాల సంఘటనలను గుర్తుతెచ్చుకుంటు నడుస్తున్నాడు. అదేమిటో వద్దనుకున్న దెయ్యం కథలే గుర్తుకొస్తున్నాయి. తను చదువుకున్న హై స్కూలు చదువు తెలివికి, దెయ్యాలు లేవనిపిస్తున్నా, ఈ సమయం లో అవి వుండే అవకాశం వుందేమో అని అనుమానం మొదలయ్యింది.

"శ్రీ ఆంజనేయం, ప్రసన్నాంజనేయం" అని (స్తోత్రం లో అంతవరకే వచ్చుమరి) మాటి మాటికి అనుకుంటూ, నడవసాగాడు. ఓరి

అవతలి ప్రక్కనున్న యలమంచమ్మ గుడి వైపు, నెగళ్ళ నుండి వెలుతురి పల్చగా వస్తోంది. అమ్మయ్య, తాటి తోపు దగ్గరికి వచ్చాడు. అసలు గండం ఇదే.. ఇది దాటితే ఊళ్ళో పడ్డట్లే. తోపులో నుండి గాలి ఈల వేస్తోంది. పెద్ద ధైర్యం వున్న వాళ్ళలా కథలు చెపుతాం కానీ, చుట్టూ చీకట్లో, నడి మధ్యలో ఒక్కరమే వుండి, చుట్టూ గాలి సంగీత కచేరీ చేస్తుంటే అప్పుడుంటుంది మన కథ.

యహూ.. ఊరి దగ్గరికి వచ్చాం, గట్టిగా కేక వేస్తే ఊళ్ళోకి వినపడుద్ది. ఇంక భయమేమిటి?" సెల్ ఫోన్ చూసాడు సిగ్నల్ లేదు. మరిచిపోయాడు తను వాడే నెట్ వర్క్ కి ఇక్కడ సిగ్నల్ వుండదు. ఇక్కడుండేది తను పని చేసే చోట వుండదు. అడుగులు గబ గబ వేయసాగాడు.

ఇమతలో కాలికేదో తగిలి దూరంగా పడ్డట్టనిపించింది. లైట్ అటు వేశాడు మసక వెళుతురులో ఏదో మెరుస్తూ కనపడింది చటుక్కున వంగి తీశాడు.

"అమ్మో, ఉంగరం. తనది పోద్దేమో అని జాగర్త పడుతోంటే తనకే ఇక్కడ మరో ఉంగరం .. గిల్టుదేమో ఒకవేళ బంగారమే కావచ్చుగా.. పాపం ఎవరిదో .. తెల్లారిన తరువాత ఎవరిదో తెలుసుకుని ఇవ్వచ్చులే" చకచకా నడవసాగాడు.

"ఎంత, ఏడెనిమిది గ్రాముల బరువుంటుందా?.. బంగారందైతే ఎంతలేదన్నా పాతికవేలు.. జేబులోని వుంగరాన్ని తడుముకున్నాడు. ఏదో చప్పుడయింది. ఉలిక్కిపడ్డాడు. సెల్లు లైటు అటు వేశాడు. పందికొక్కు.. తాటి తోపులోకి ఉరికింది.

మళ్ళీ అలోచనలు ముసురుకున్నాయి. "పాతకవేలతో ఏమేం కొనుక్కోవచ్చు?.. ఇంట్లో టీవి లేదు.. దాదాపు అందరిళ్ళల్లో వుంటున్నాయి. పెద్దాడు రోజూ స్కూలుకి నడిచివెళ్తున్నాడు..."

యలమంచమ్మ తల్లి దయ .. తల్లిదయ వుండబట్టే ఎవరికో కాకుండా తనకు దొరికింది"

తెల్లవారి గూడెంలో తెలిస్తే నాదే అని ఎవరైనా వస్తారేమో?"

"తనకు కాకుండా వేరే ఓరు వాళ్ళకి దొరికితే యిస్తారా? అసలు దొరికిన సంగతి తెలుస్తుందా?"

"అమ్మోరు తల్లి ఇచ్చిన అదృష్టాన్ని జార విడుచుకుంటామా?

ఎవ్వరికి చెప్పకూడదు.. భార్యకు తప్ప ఇంట్లో కూడా ఎవ్వరికీ చెప్పకూడదు" నిర్ణయించుకున్నాడు.

వేగం గా అడుగులు వేశాడు. చూస్తుండగానే, తాటితోపు దూరం అవుతోంది. వెనుక ఎవరో వస్తున్నట్లు అనిపించింది. వెనక్కు తిరిగిచూడాలనుకున్నాడు. తిరగలేకపోయాడు.

"అదిగో సత్యం బాబాయ్ ఇల్లు, పక్కనే తమ ఇల్లు. గూడెం వచ్చింది. అంత చలిలోనూ చేతులకు చెమట్లు పడుతున్నాయి. పాంట్ జేబులో వున్న ఉంగరం పై చేయి పెట్టి పరిగెత్తినట్లుగా ఇంట్లో పడ్డాడు.

అలికిడికి భార్య లేచింది. "ఏమయ్యా! ఇంత ఆలశ్యమయింది. చీకటంటే మాలావు బయ్యం గదా.. బానే వచ్చావే.. ఎక్కడున్న పడుకుని తెల్లారగట్లా వస్తవేమో అనుకున్న కళ్ళు నులుముకుంటూనే నవ్వింది. అల్లా ఎకసెక్కాలాడుతున్నప్పుడు పెళ్ళాం తనకు భలే నచ్చుద్ది.ఎగపోత ఓప్రిని అణుచుకుంటూ, మొహానికి పట్టిన చెమట్లు తుడుచుకుంటూ, కాళ్ళు కడుక్కోడానికి గాటు దగ్గరికి వెళ్ళాడు."ఎంకటా.. ఏవయినా తింటడేమో పెట్టు" అలికిడికి లేచిన అత్త పడుకునే అన్నది.

సరే అత్తా! అని ఏమయ్యా.. తింటావా? మొగుడ్ని అడిగింది.

"అబ్బ, ఇప్పుడేం వద్దులేవే, అర్ధరాత్రి వేళ దెయ్యాల మాదిరి ఏం తింటాం? అంటూ వసారాలో దండెం మీది లుంగీ తీసుకుని కట్టుకున్నాడు.లోపలి గదిలో వేసిన పక్క మీదకు చేరాడు. పిల్లల తల నిమురుతూ దొరికిన ఉంగరం సంగతి గుసగుసగా చెప్పాడు. లేచి పాంట్ జేబులో నుండి ఉంగరం తీసి భార్య చేతిలో పెట్టాడు.

భార్య దానిని రెండు వేళ్ళతో పట్టుకుని పరీక్షగా చూసింది. అటు తిప్పింది, ఇటు తిప్పింది. ఇక ఒకటే నవ్వసాగిడంది. ఏప్పుడొచ్చాడో.. ఏడో తరగతి చదివే పెద్దకొడు కూడా తల్లికి వంత కలిపాడు.

"నీ వుంగరం ఏది నాన్నా? ఇటియ్యి చేయి చాపాడు.

వెంకట్రావ్ వంగి పాంట్ కింద తడుముకున్నాడు. పిన్నీసు లేదు, ఎర్రరాయి ఉంగరమూ లేదు. బిక్క మొహం వేశాడు. తను అనుకున్న మాటలన్నీ చకచకా రీలులా మనసులో గిర్రున తిరగాయి. ఏదో నష్టం వచ్చినట్లు దిగులుగా అనిపించింది.... సిగ్గుగా కూడా..

."ఎలమంచమ్మ తల్లి దయ. మన వస్తువు పోలేదు.. ఐనా మనయి మనకు మిగిలితే చాలయ్యా, కలిసొచ్చే అదృష్టం మనకు రాదు. వచ్చినా వద్దు.

'కొడుకు మెడ చుట్టూ ఎడమ చేయి వేసి, మరో చేత్తో మొగుడి తల మీద మురిపెం గా మొట్టింది.

" అబ్బా! తల రుద్దుకుంటూ ఇద్దరినీ చేతులతో చుట్టాడు వెంకట్రావు.




రాజు వేసంగి సెలవులకి ఊళ్ళో వుండే వాళ్ళ తాతయ్య ఇంటికి వెళ్ళాడు.

రాత్రి భోజనాలయ్యాక పున్నమి వెన్నెట్లో అందరూ ఆరు బయట మంచాలేసుకుని పడుకుని కబుర్లుచెప్పుకుంటున్నారు.

"తాతయ్యా..మనింట్లో వున్న ఆ పెద్ద మామిడి చెట్టు ఎవరు..ఎప్పుడు నాటారు?"అడిగాడు రాజు.

"ఓహ్! అదా..దానిపేరు రామయ్య మామిడి చెట్టు" అన్నాడాయన నవ్వుతూ.

"రామయ్య మామిడి చెట్టా? అదేంటి తాతయ్యా దానిపేరు అలావుంది?" లేచి మంచంపైన బాసింపట్టు వేసుకుని కూర్చుని

ఆశ్చర్యంగా అడిగాడు.

"చెబుతాన్రా..మరేమో అప్పుడు నేను నీ అంత చిన్న పిల్లవాడిని..మీ నాన్న కానీ..నువ్వు కాని పుట్టలేదన్నమాట. అప్పుడు మా నాన్న ఈ ఇంట్లో ఒక వాటాని రామయ్యా అనే అతనికి అద్దెకిచ్చాడు. రామయ్య చాలా మంచివాడు. అందరికీ సహాయం చేస్తూ తలలో నాలుకలా వుండేవాడు. అతడు ఒకనాడు మా నాన్న దగ్గరకు వచ్చి 'అయ్యా! మనింటి చుట్టూ ఉన్న స్థలమంతా మొక్కల్లేక బోసిపోయి వుంది. అందుచేత మీరనుమతిస్తే నేను నాలుగురకాల పూల..పళ్ళ మొక్కలు నాటుతాను..ఇంటికి కళ వస్తుంది.' అన్నాడు. మా నాన్నగారేమో 'సరే! నాకేం అభ్యంతరం లేదు' అన్నాడు.

రామయ్య జామ, మామిడి, సపోట, పనస లాంటి చెట్లతో పాటు బంతి, చేమంతి, మల్లె, కనకాంబరం మొదలగు పూలమొక్కలు నాటడమే కాకుండా వాటికి చక్కగా కుదుళ్ళు తీయడం, ఎరువులేయడం, నీళ్ళుపోయడం చేసేవాడు. అవి ఏపుగా పెరిగి మా ఇంటి అవసరాలకి ఎంతగానో ఉపయోగపడేవి. మా నాన్నగారికి రామయ్య మీద మంచి అభిమానం ఏర్పడింది. ఆయన అప్పుటికప్పుడే 'రామయ్యా..మొక్కలు నాటి ఈ ఇంటికి కళా..కాంతి తీసుకొచ్చావు..ఈ చెట్లు తర తరాలకీ ఎంతగానో ఉపయోగపడతాయి. అందుకని ప్రతి చెట్టు పేరు మొదట్లో నీ పేరు చేరుస్తాను. అలా ఈ ఇంట్లో నీ పేరు శాశ్వతం అవుతుంది' అన్నాడు.

అలా ఈ ఇంట్లోని ప్రతిచెట్టు రామయ్య చలవే! ఆ మహానుభావుడు ఇప్పుడున్నాడో..లేడో కాని మనం ఆయన్ని తల్చుకున్నాము. అందుకని నువ్వు కూడా మీ ఊరెళ్ళింతర్వాత మొక్కలు నాటు, అవి ముందు ముందు ఎంతోమందికి నీడనిస్తాయి. కాయలు..పళ్ళూ ఇస్తాయి.. వైద్యానికి ఉపయోగపడతాయి." అన్నాడు.

"అలాగే తాతయ్యా! నేను మొక్కలు నాటడమే కాకుండా మా పాఠశాలలోని స్నేహితులకి కూడా నువ్వు చెప్పింది చెప్పి మొక్కలు నాటిస్తాను."అన్నాడు ధృడంగా.

"అలాగే కన్నా..మరి పడుకో..ఇప్పటికే ఆలస్యమైంది" అన్నాడాయన నిద్రకు ఉపక్రమిస్తూ.